



వేదిక సరే.. పరిష్కారం ఎక్కడ..?

● వేలల్లో వినతులు.. పదుల్లో పరిష్కారాలు ● కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అందని న్యాయం ● ఇదీ ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక తీరు

ప్రజల సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించాలన్న లక్ష్యంతో చేపడుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అవి పరిష్కారం కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి సోమవారం జరిగే ఈ కార్యక్రమానికి గ్రామ, జిల్లా స్థాయి నుంచి వేలాదిగా ఫిర్యాదులు వస్తున్నా అందులో పదుల సంఖ్యలో కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికితోడు రాజకీయ నేతల ప్రమేయం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండల, డివిజన్ స్థాయిలో పరిష్కారం కాని ఎన్నో రకాల సమస్యలను బాధితులు నేరుగా జిల్లా కేంద్రానికి వచ్చి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. అయితే ఆ అర్జీలు తిరిగి గ్రామ, మండల స్థాయి అధికారుల వద్దకు వెళుతుండడంతో అక్కడున్న కింది స్థాయి అధికారులు బాధితులతో మాట్లాడకుండా, గ్రామానికి వెళ్లి విచారించకుండానే వారికి అనుకూలంగా ఉన్న వ్యక్తులను పిలిపించుకుని తప్పుడు అర్జీలు నమోదు చేసి సమస్యను పరిష్కరించినట్లు ఉన్నతాధికారులకు పంపించి వారిని తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో జిల్లా నలుమూలల నుంచి ప్రతి సోమవారం జిల్లా కేంద్రానికి రావడం, ఉన్నతాధికారులకు అర్జీలు ఇవ్వడం, తిరిగి ఇళ్లకు వెళ్లడం బాధితులకు పరిపాటిగా మారింది. దీంతో ఎంతో మంది బాధితులు నెలలు, సంవత్సరాల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ సమస్యలు పరిష్కారం కాక వాటితో రాజీపడుతూ ఉసూరుమంటూ ఇళ్లకు చేరుతున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరిస్తే తప్ప గత ప్రభుత్వం మత్తులో ఉన్న అధికారుల్లో మార్పు రాదంటూ పలువురు అభిప్రాయపడుతున్నారు.

- రాయచోటిటౌన్ (ఆంధ్రజ్యోతి)



ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన బాధితులు (ఫైల్)



వికలత్వంతో ఉన్నా పింఛన్ రావడం లేదు..

ఈమె పేరు రత్నమ్మ. అన్నమయ్య జిల్లా పరిధిలోని రాయచోటి నియోజకవర్గం గాలివీడు మండలం ఎగువగొట్టివీడు. ఈమెకు నవీన్‌కుమార్ అనే ఏడు సంవత్సరాల బుద్ధిమాంద్యం కుమారుడు ఉన్నాడు. బిడ్డకు ప్రభుత్వం వికలాంగుల పింఛన్ ఇస్తుందని గతంలో కడప రిమ్స్ నుంచి వికలత్వం సర్టిఫికెట్ తీసుకొచ్చి దరఖాస్తు పూర్తి చేసి గాలివీడు మండల పరిషత్ అధికారులకు ఇచ్చింది. అయితే ఆరు నెలలు వారి వద్దనే దరఖాస్తులు ఉంచుకున్న మండల పరిషత్ అధికారులు కడపలో తెచ్చిన ఈ సర్టిఫికెట్ చెల్లదు. అన్నమయ్య జిల్లా పేరుతో సర్టిఫికెట్ తీసుకురావాలంటూ చావుకబురు చల్లగా చెప్పారు. దీంతో నవీన్‌కుమార్ తల్లి రత్నమ్మ గ్రామ సచివాలయం నుంచి వికలత్వ సర్టిఫికెట్ తీసుకెళ్లి మండల పరిషత్ అధికారులకు ఇస్తే మేము ఏమీ చేయలేము. మీరు జిల్లా అధికారులను కలవండంటూ చేతులెత్తేశారు. దీంతో దిక్కుతోచని స్థితిలో బుద్ధిమాంద్యంతో ఉన్న బిడ్డను చంకన వేసుకుని ఆ తల్లి కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతోంది.

నా భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోండి..



ఇతని పేరు బుడ్డపల్లి రెడ్డెప్ప. ఇతను గుర్రకొండ మండలం పాత ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఇతని తాత బుడ్డపల్లి కదిరయ్య పేరుతో 1981వ సంవత్సరంలో సర్వే నెంబర్ 522/3లో ఎకరా నాలుగు సెంట్ల భూమిని పట్టాగా ఇచ్చారు. అయితే తమ భూమిని పక్కనే ఉన్న సర్వే నెంబరు 522/2లో రహంతుల్లా అనే వ్యక్తికి భూమి పట్టా ఇచ్చారని తెలిపారు. అయితే తమ భూమి పక్కనే ఉండడంతో రహంతుల్లా అనే వ్యక్తి దౌర్జన్యంగా తన భూమిని ఆక్రమించి చదును చేసి అతడి భూమిలో కలుపుకొని పంటను సాగు చేస్తున్నాడని రెడ్డెప్ప వాపోయాడు. దీనిపై మదనపల్లి కోర్టులో కూడా దావా వేయడంతో కోర్టు కూడా ఆ భూమిని తమకే చెందుతుందని తీర్పు ఇచ్చిందన్నారు. అయితే అధికారులు మాత్రం రెవెన్యూ రికార్డుల్లో పక్కాగా తన తాత పేరుతో పట్టా ఉన్నప్పటికీ రహంతుల్లాకు అనుకూలంగా వ్యవహరిస్తూ తనకు అన్యాయం చేస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. దళితుడినైన తనకు ఆ భూమి తప్ప వేరే ఆధారం లేదని, అధికారులు పరిశీలించి విచారించి రహంతుల్లా దౌర్జన్యంగా ఆక్రమించిన తమ భూమిని తనకు ఇప్పించి ఆదుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను వేడుకుంటున్నాడు.

విచారించకుండానే తప్పుడు సమాచారాన్ని ఇచ్చారు..



ఇతని పేరు రెడ్డిబసయ్య. ఇతడి స్వగ్రామం సుండుపల్లె మండలంలోని చిన్నగొల్లపల్లి గ్రామం పాతజంగంపల్లి. రాయచోటి పట్టణంలో ఉంటున్నాడు. ఇతని తల్లిదండ్రులు పాతజంగంపల్లిలోనే నివసిస్తుండటంతో ప్రతి శని, ఆదివారాల్లో స్వగ్రామానికి వెళ్లి వస్తుంటాడు. అయితే పాత జంగంపల్లెలో ఉన్న నీటి పథకం బోరుకు కొంతమంది గేట్‌వాల్ బిగించి ఎగువ భాగానికి నీరు సరిగ్గా వెళ్లకుండా చేస్తుండడంతో తాగునీటి సమస్య తీవ్రమైంది. దీంతో రెడ్డిబసయ్య స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ అధికారులు స్పందించకపోవడంతో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఫిర్యాదు చేశాడు. ఈ అర్జీపై అర్జీదారుని సమక్షంలో విచారించాల్సిన పంచాయతీ సెక్రటరీ రాజకీయ నాయకుల ప్రోద్బలంతో వారికి అనుకూలంగా ఉన్నవారి చేత సంతకాలు చేయించుకుని సమస్య పరిష్కారమైనట్లు ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చాడని బాధితుడు రెడ్డిబసయ్య ఆరోపిస్తున్నారు. ఈ సంఘటనపై ఫిర్యాదుదారుడు కలెక్టర్‌ను నేరుగా కలిసి సమస్య వివరిస్తానని చెబుతున్నాడు.

మా భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నారు..



ఇతడి పేరు రావూరి వెంకటయ్య. ఇతను సుండుపల్లె మండలం కుమ్మరపల్లి నివాసి. ఇతను రాయచోటి మండలం శిబ్యాల గ్రామం అనుంపల్లిలో ధరణికోట నాగన్న కుమార్తెను వివాహం చేసుకున్నాడు. అయితే వెంకటయ్య మామ ధరణికోట నాగన్న సర్వే నెంబర్ 1713/3లో అల్లుడికి దాన విక్రయం కింద ఒకటిన్నర ఎకరా భూమిని రాయించి ఇచ్చాడు. అయితే అనుంపల్లెకు చెందిన 30 ఎకరాల భూములు గల హరినాథరెడ్డి అనే వ్యక్తి తమ బంధువులైన వీరబల్లి మండలం మాదిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీలోని కొత్తపల్లెకు చెందిన సుంకేల కళ్యాణమ్మ పేరుతో తమ భూమిని ఆన్‌లైన్ చేయించారని రావూరి వెంకటయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. భూమి కోసం ఆరు సంవత్సరాలుగా అటు రెవెన్యూ అధికారులు చుట్టూ ఇటు పోలీసుల చుట్టూ జిల్లా స్థాయి అధికారులు చుట్టూ తిరుగుతున్నా మా గోడు ఎవ్వరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేశాం..

ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ఫిర్యాదుదారులు ఇచ్చే అర్జీల సమస్యల పరిష్కారానికి కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేశాం. బాధితులు ఇచ్చే ప్రతి అర్జీని మానిటరింగ్ చేసి సమస్య పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుపై సంబంధిత అధికారులు నేరుగా సమస్య ఉన్న ప్రాంతానికి వెళ్లి విచారించి సమస్యను పరిష్కరించి సంబంధిత సమాచారాన్ని కలెక్టర్ కార్యాలయానికి అందచేయాలి. బాధితులతో మాట్లాడకుండా సమస్య పరిష్కారమైనట్లు తప్పుడు సమాచారం ఇస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- ఆదర్శ్ రాజేంద్రన్, జాయింట్ కలెక్టర్

ఇంటి నుంచి బయటకు గెంటేసి తాళాలు వేశారు..



ఈమె పేరు పెద్ద లక్ష్మమ్మ. మదనపల్లి పట్టణానికి చెందిన నరసింహులు పెద్ద భార్య పెద్ద లక్ష్మమ్మ, తన భర్త సంపాదించి కట్టిన ఇంటి నుంచి తన భర్త రెండో భార్య చిన్నలక్ష్మమ్మ ఆమె కుమారులు ప్రకాశ్, శివ తనను ఇంటి నుంచి గెంటేసి ఇంటికి తాళాలు వేయడంతో పాటు ఇంట్లోకి తనను రానివ్వడం లేదంటూ పెద్ద లక్ష్మమ్మ రెండు సంవత్సరాలుగా రాయచోటి కోర్టుతో పాటు జిల్లా అధికారుల చుట్టూ తిరుగుతోంది. దీంతో తాను మదనపల్లి పట్టణంలోని కాలువ గట్టుపై రేకుల షెడ్డు వేసుకుని ఉంటున్నానని, తన గోడు ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతోంది. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ సొమ్ముతో ఉచితంగా ఇచ్చే బియ్యంతో కడుపు నింపుకుంటున్నానని, ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు విచారించి తన ఇల్లు తనకు ఇప్పించి న్యాయం చేయాలని ఆమె అధికారులను వేడుకుంటోంది.

కుడాను నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా

● ముక్కా రూపానందరెడ్డి
● కుడా చైర్మన్‌గా ప్రమాణస్వీకారం



కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న ముక్కా రూపానందరెడ్డి

కడప మారుతీనగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) నెంబర్ వన్ స్థానంలో ఉండేలా తీర్చిదిద్దుతామని ఆ అథారిటీ నూతన ఛైర్మన్, రైల్వేకోడూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. ప్రభుత్వం ఇటీవల ఆయనను కుడా ఛైర్మన్‌గా నియమించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం చిన్నచౌక్‌లోని ఆదిత్య కల్యాణ మండపంలో కుడా ఛైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల శాసనసభ్యులతో, ఇన్‌చార్జిలతో చర్చించి కుడాను ముందుకు తీసుకెళ్తామన్నారు. ప్రధానంగా రియల్ ఎస్టేట్ వ్యాపార రంగంలో తనకున్న అనుభవం మరింత దోహదపడుతుందన్నారు. ఇప్పటికే ప్రొద్దుటూరులో 40 ఎకరాలు, బద్వేల్‌లో 30 ఎకరాలు, రాజంపేటలో 20 ఎకరాలు, రాయచోటిలో 20 ఎకరాలు కేటాయించారని.. వీటికి అదనంగా మరో 20 ఎకరాలు, కోడూరులో 20 ఎకరాల భూములు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఇదిలా ఉండగా ఒక్కో నియోజకవర్గంలో 50 నుంచి 60 ఎకరాల భూములను తమ అథారిటీ పరిధిలోకి ఇవ్వగలిగితే ప్రభుత్వం ద్వారా వచ్చే నిధులతో సదుపాయాలు కల్పించి మ రింత అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో కుడా ఛైర్మన్‌గా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతటితో ఆగకుండా కోడూరుకు ఒక విప్, రెండు ఛైర్మన్ పదవులు, మరో రెండు డైరెక్టర్ పదవులు ఇచ్చారన్నారు. తనకు రాజకీయ జన్మనిచ్చింది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడైతే, పునర్జన్మనిచ్చింది డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు.



ముక్కా రూపానందరెడ్డిని సన్మానిస్తున్న రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు.. చిత్రంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తదితరులు

అట్టహాసంగా ప్రమాణ స్వీకారం

ప్రమాణస్వీకార కార్యక్రమం అట్టహాసంగా సాగింది. పెద్ద ఎత్తున రైల్వేకోడూరు నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు, ముక్కా రూపానందరెడ్డి అభిమానులు, బంధుమిత్రులు హాజరయ్యారు. తొలుత ముక్కా రూపానందరెడ్డి చేత కడప జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ ప్రమాణస్వీకారం చేయించి, పూలమొక్కను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు సి.రామచంద్రయ్య, రామగోపాల్‌రెడ్డి, రైల్వేకోడూరు, కమలాపురం ఎమ్మెల్యేలు అరవ శ్రీధర్, పుత్తా చైతన్యరెడ్డి రాష్ట్ర ఖాదీ బోర్డు ఛైర్మన్ కేకే చౌదరి, రైల్వేకోడూరు టీడీపీ నేత పంతగాని నరసింహప్రసాద్, అన్నమయ్య జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేశ్, టీడీపీ కడప జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, హరిప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ దుద్యాల అనితా దీప్తి, న్యాయవాది గుర్రప్ప పలువురు నేతలు పాల్గొన్నారు. కాగా కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డిని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు శాలువా కప్పి సన్మానించి అభినందించారు.

స్వర్ణాంధ్రగా మార్చేందుకు కలెక్టర్ల కృషి కీలకం

● కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు ● పాల్గొన్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా మార్చేందుకు కలెక్టర్ల కృషి కీలమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. విజయవాడలోని వెలగపూడి సచివాలయంలో బుధవారం కలెక్టర్లతో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పాల్గొన్నారు. సదస్సులో పబ్లిక్ పల్స్‌వాట్సప్ ద్వారా ప్రజలకు సేవలు, గ్రామీణ నీటిసరఫరా, పౌరసరఫరాల శాఖ, మున్సిపల్ పరిపాలన, పంచాయతీరాజ్, తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. సదస్సు అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాయలసీమ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో ప్రత్యేకంగా సమావేశమై శాంతిభద్రతల అంశంపై చర్చించారు. రాయచోటి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నా రు. ముఖ్యమంత్రి ప్రసంగం అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ జిల్లా స్థాయి అధికారులనుద్దేశించి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేసిన దిశానిర్దేశం మేరకు జిల్లా అధికారులందరూ కార్యాచరణ రూపొందించుకుని ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.



శాంతిభద్రతల సమస్యలపై రాయలసీమ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో చర్చిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

పది మంది తహసీల్దార్లకు మెమోలు

● పది రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలన్న కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పదిమంది తహసీల్దార్లకు కలెక్టర్ చామకూరి శ్రీధర్ మెమోలు ఇచ్చారు. ఈనెల 6వ తేదీ ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఆ తహసీల్దార్లు దేశముదుర్లు' అన్న శీర్షికన కథనం వెలువడింది. దీనిపై కలెక్టర్ సీరియస్‌గా స్పందిస్తూ రామసముద్రం, రాజంపేట, రామాపురం, వీరబల్లి, లక్కిరెడ్డిపల్లె, ఓబులవారిపల్లె, కలకడ, గుర్రంకొండ, రాయచోటి, బి.కొత్తకోట తహసీల్దార్లకు మెమోలు ఇస్తూ పది రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ఈ పది మంది తహసీల్దార్‌లు సంజాయిషీ సరైనది కాకపోతే వారిపైన చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలిసింది. ఈ విషయంపై కలెక్టరేట్ ఏవో నాగభూషణంను వివరణ కోరగా పదిమంది తహసీల్దార్లకు మెమోలు ఇచ్చింది వాస్తవమేనని తెలిపారు.

పింఛాలో జలకళ



పూర్తి నీటి సామర్థ్యంతో జలకళ సంతరించుకున్న ప్రాజెక్టు

- నీటితో కళకళలాడుతున్న ప్రాజెక్టు
- కాలువల్లోకి నీరు విడుదల
- కుంటలు, చెరువులు నింపడమే లక్ష్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

సుండుపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ పింఛా నదిపై నిర్మించిన పింఛా ప్రాజెక్టు వర్షపు నీటితో కళకళలాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో పూర్తి సామర్థ్యంతో ప్రాజెక్టులోకి నీరు చేరింది. పది రోజులుగా దాదాపు 500 ఎస్టీఎంసీలు నీటిని నదికి విడుదల చేశారు. 2020 నవంబరు 26వ తేదీ అర్ధరాత్రి పై ప్రాంతాల నుంచి వచ్చిన వరదల కారణంగా పింఛా ప్రాజెక్టు మట్టికట్ట కొట్టుకుపోయింది. అప్పట్లో ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న రైతులు చాలామందికి నష్టం వాటిల్లింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం తూతూ మంత్రంగా కొంతమందికి నష్టపరిహారం అందించి చేతులు దులుపుకుంది. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి ప్రాజెక్టు మరమ్మతులు చేసేందుకు అనుమతులు రాలేదు. మూడు సంవత్సరాలైనా వైసీపీ పాలకులు స్పందించలేదు. ఆ తర్వాత సీపీఐ ఆధ్వర్యంలో పింఛా నుంచి అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వరకు వందలాది మంది రైతులు, రైతు కూలీలు, స్థానిక ప్రజలు, టీడీపీ, జనసేన, ప్రజా సంఘాలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. దీంతో 2023 మార్చి నెలలో రూ.84.33 కోట్లతో పనులు ప్రారంభించారు. రెండు నెలల క్రితం ప్రాజెక్టు పనులు దాదాపు పూర్తయిపోయాయి. త్వరగా పనులు పూర్తి చేసి నీటిని నిల్వ చేయాలని కూటమి నేతలు సంబంధిత అధికారులపై ఒత్తిడి తేవడం వలన కుడికాలువ గేటు ఏర్పాటు చేశారు. గేటు ఏర్పాటు పనులు జరుగుతుండగానే ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో నిండింది. రైతులకు మంచి రోజులు వచ్చాయి.

ప్రాజెక్టు ఎప్పుడు కట్టారంటే....

1954వ సంవత్సరంలో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టును 1960వ సంవత్సరంలో పూర్తి చేశారు. 1961వ సంవత్సరంలోనే ప్రాజెక్టును పరీక్షించి 1962వ సంవత్సరంలో పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేయడం ప్రారంభించారు. ప్రాజెక్టు మొత్తం సామర్థ్యం 0.327 ఎస్టీఎంసీలు. ఈ ప్రాజెక్టు కింద మొత్తం ఆయకట్టు 3,773.41 ఎకరాలు. ఈ ప్రాజెక్టుకు రెండు ప్రధాన కాలువలు కలవు. కుడికాలువ కింద 2211.41 ఎకరాల ఆయకట్టు ఉంది. కుడికాలువ ద్వారా అధికారికంగా 17 తూముల ద్వారా రైతులకు సాగునీరు అందిస్తోంది. ఎడమ కాలువ కింద 1562 ఎకరాల ఆయకట్టు భూమి కలదు. ఎడమ కాలువకు రెండు బ్రాంచ్ ఛానల్స్ ఉన్నాయి. మొత్తం అధికారికంగా 14 తూముల ద్వారా పంటలకు నీరు అందిస్తారు. పూర్తి సామర్థ్యంతో ప్రాజెక్టు నిండడం వలన మొత్తం ఆయకట్టు సాగు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం కుడి, ఎడమ కాలువల ద్వారా రైతులకు నీరు అందిస్తున్నారు.

కుంటలు, చెరువులకు జలకళ

పింఛా ప్రాజెక్టు మీద ఆధారపడి ఉన్న 12 కుంటలు, చెరువులు కూడా వర్షపు నీటితో కళకళలాడనున్నాయి. కుడి కాలువ ద్వారా ఒడ్డుకుంట, రెడ్డిచెరువు, రవ్వలకుంట, సుబ్బయ్యకుంట, పాలెంగడ్డ కుంటలు నిండి ఉన్నాయి. రెడ్డిచెరువు ద్వారా 90 శాతం ప్రాజెక్టు నీటితో ఇప్పటికే నిండింది. నీటిలో కళకళలాడుతోంది. ఎడమ కాలువ ద్వారా విడుదల చేసే నీటితో చిన్న నాగిరెడ్డికుంటలు రెండు, అత్తాకోడలు కుంటలు, కొత్తపల్లికుంట, అయ్యవారిచెరువు నిండనున్నాయి. ఈ చెరువులు, కుంటలు పూర్తి సామర్థ్యంతో నిండితే బోరు బావుల్లో పుష్కలంగా నీరు వచ్చి రైతులకు సాగునీటి సమస్య లేకుండాపోతాయి. అలాగే ఆ చెరువులు, కుంటల కింద ఉన్న సాగు భూములకు సాగునీటి సమస్యలు ఏర్పడవని రైతులు చెబుతున్నారు.

తాండాలకు వరప్రసాదిని

పింఛా, పెద్దినేనికాలువ, రాయవరం, మాచిరెడ్డిగారిపల్లె ప్రాంతాల ప్రజలకు పింఛా ప్రాజెక్టు వరప్రసాదిని. ముఖ్యంగా ఒకప్పుడు నాగరిక సమాజానికి దూరంగా ఉండే తాండాలు పింఛా ప్రాజెక్టు నిర్మాణంతో వారి దశ తిరిగింది. ప్రాజెక్టు నిర్మాణంతో సుండుపల్లె మండలంలోని 15 గిరిజన తాండాల ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. ఇప్పటికీ వందల కుటుంబాలు ప్రాజెక్టును నమ్ముకుని వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నారు.

ఆహ్లాదకరమైన వాతావరణం

ఆహ్లాదకరమైన వాతావరణం. ఆకర్షణీయమైన దృశ్యాలతో సందర్శకులను ఇట్టే ఆకట్టుకునే ప్రాంతాల్లో ఉమ్మడి జిల్లాలోని పింఛా ప్రాజెక్టు ఒకటి. సందర్శకులకు ఇక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడం, ఉన్న వాటి గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో రోజురోజుకు సందర్శకుల సంఖ్య తగ్గిపోతోంది. ప్రాజెక్టు దిగువ భాగంలో ఏర్పాటు చేసిన పార్కు నివర్ తుఫాను కారణంగా పెద్ద పెద్ద వృక్షాలు, కట్టడాలు కొట్టుకుపోయాయి. ప్రాజెక్టుకు సమీపంలో ఉన్న అతిథి గృహాలను ఎవ్వరూ పట్టించుకోకపోవడం వలన శిథిలమై పిచ్చిమొక్కలతో నిండి ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో ఈ ప్రాంతం అధ్వానంగా మారింది. జిల్లా అధికారులు, పర్యాటకశాఖ వారు పింఛా సోయగాలపై దృష్టి పెట్టి వాటిని అభివృద్ధి చేస్తే పింఛా పర్యాటకులను ఆకర్షించగలరని స్థానికులు కోరుతున్నారు.

మంచి రోజులు వచ్చాయి



ప్రాజెక్టు దిగువ భాగంలో ఉండే రైతులకు మంచి రోజులు వచ్చాయి. నాలుగు సంవత్సరాల తర్వాత ప్రాజెక్టు నిండింది. ఈ కారు ప్రతి రైతు పంటలు పండించుకోవచ్చు. సకాలంలో గేటు మరమ్మతులు చేసి నీరు నిల్వ చేయడం సంతోషదాయకం.

\- వెంకటరమణ నాయుడు, రైతు, నగిరి

ప్రాజెక్టు పూర్తిగా నిండింది

ప్రాజెక్టు నీటి సామర్థ్యంతో నిండింది. ఈ ఏడాది రైతులకు సాగునీటి సమస్య ఉండదు. రైతులు నీరు వృథా కాకుండా వినియోగించుకోవాలి. ప్రాజెక్టుకు నూతనంగా మరవ ఏర్పాటు చేశాము. దాదాపు పనులు పూర్తి అయిపోయాయి.

\- నాగేంద్రనాయక్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్



యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి పింఛా జలాశయం



కుడికాలువలో ప్రవహిస్తున్న నీరు

ప్రభుత్వ భూమి కబ్జా యత్నం



స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దారు

నందలూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) మండలంలోని నల్ల తిమ్మయ్యగారిపల్లె గ్రామం సర్వే నంబరు 293లో రెండెకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు బుధవారం కొంతమంది ప్రయత్నించారు. హైకోర్టు ఆర్డరు ఉందంటూ ఎక్స్‌కవేటర్‌తో ప్రభుత్వ భూముల్లో చెట్లను తొలగించడం మొదలుపెట్టారు. అడ్డుకున్న వీఆర్‌ఏలను బెదిరించారు. సమాచారం అందుకున్న తహసీల్దారు అమర్‌నాథ్ సంఘటనా స్థలానికి చేరుకోవడంతో కబ్జాదారులు పరారయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎటువంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వ భూములను ఆక్రమించడానికి ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమినే చదును చేశారు...



కబ్జా చేసేందుకు చదును చేసిన ప్రభుత్వ భూమి

సిద్దవటం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దపల్లి రెవెన్యూ ఉప్పరపల్లె గ్రామానికి చెందిన సర్వేనంబరు 1114 లోని 5.09 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు చదును చేస్తున్నా అధికారులు అటువైపు చూడడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత దృష్టికి తీసుకెళ్లగా ఆ ప్రదేశానికి తమ సిబ్బందిని పంపించామని, భూమి చదును చేసిన వారు తమ దగ్గరున్న పత్రాలను తహసీల్దారు కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించామన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో దోపిడీని అరికట్టండి

మదనపల్లె ప్రభుత్వాస్పత్రి ఎదుట సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకుల నిరసన



జిల్లాప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిరసన తెలియచేస్తున్న సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలపై జరుగుతున్న దోపిడీని అరికట్టాలని సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రి ఎదుట వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మదనపల్లె కార్యదర్శి మురళి మాట్లాడుతూ ఆస్పత్రి డాక్టర్లు ప్రైవేట్‌గా స్కానింగ్, ఎంఆర్ఐ స్కానింగ్, ఎక్స్‌రేలు ఏర్పాటు చేసుకొని రోగులకు అవసరం లేకున్నా వారి సెంటర్లలో తీయిస్తూ సొమ్ము చేసుకొంటున్నారని ఆరోపించారు. జిల్లా ఆస్పత్రిలో డాక్టర్లు కొరత కారణంగా అప్రెంటీస్ డాక్టర్లే అత్యవసర విభాగాల్లో ఉండడం, అవసరమైన పరికరాలు అందుబాటులో లేని కారణంగా చిన్న చికిత్సకు బయటకు రెఫర్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంగా మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గాయత్రికి జిల్లా వినియోగదారుల ఫోరం డైరెక్టర్ రేగడి ప్రసాద్‌కుమార్, ఐటీయూసీ మదనపల్లె డివిజన్ కన్వీనర్ కృష్ణమూర్తి, ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఉత్తన్న వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా వినియోగదారుల ఫోరం డైరెక్టర్ రేగడిప్రసాద్ మాట్లాడారు. అలాగే జేసీకి, జిల్లా కలెక్టర్‌కు, డీఎం అండ్ హెచ్‌వోకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నాయకుడు మాధవ, గంగరాజు, సుబ్రహ్మణ్యం, హేమంత్‌కుమార్, జశ్వంత్, నాగేంద్ర, వరప్రసాద్, గణేష్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు పర్యాటకంపై జాతీయ సదస్సు

పీలేరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో గురు, శుక్రవారాల్లో పర్యావరణ పర్యాటకంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సుధాకర్ రెడ్డి తెలిపారు. 'పర్యావరణ పర్యాటకం(ఎకో టూరిజం)-సుస్థిరాభివృద్ధి' అనే అంశంపై భారతీయ సామాజిక శాస్త్రాల పరిశోధనా మండలి(ఐసీఎస్ఎస్ఆర్) ఆర్థిక సహకారంతో ఈ సెమినార్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ రీజనల్ డైరెక్టర్ డా.రమణ ప్రసాద్ రావుల ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ సదస్సులో పాండిచ్చేరిలోని కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఆచార్య వై.వెంకటరావు కీలక ఉపన్యాసం ఇస్తారన్నారు. ఈ సదస్సుకు దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు హాజరై పర్యావరణ పర్యాటక రంగంలోని ధోరణులు, అవకాశాలు, సవాళ్లపై చర్చిస్తారని ఆయన తెలిపారు. ఔత్సాహికులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సేంద్రియ ఎరువుగా వర్మీకంపోస్ట్



వర్మీకంపోస్టు తయారీ గురించి రైతులకు వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కలికిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సేంద్రీయ ఎరువుగా వర్మికంపోస్టును రైతులు ఎవరంతకు వారే తయారు చేసుకోవడం సులువైన పనేనని పలువురు శాస్త్రవేత్తలు సూచించారు. గ్రామాల్లో పాడి ఆవుల పోషణ విస్తృతంగా వున్నందున ఆవు పేడ తగినంతగా లభిస్తుందని, దీంతో వర్మికంపోస్టును తయారు చేసి పంట పొలాల్లో వినియోగిస్తే భూసారం పెరగడంతోపాటు పంటలకు రోగ నిరోధక శక్తి కూడా సమకూరుతందని చెప్పారు. గత వారం రోజులుగా స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో వర్మికంపోస్టు తయారీ గురించి జరుగుతున్న శిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం శిక్షణలో పాల్గొన్న వారికి పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ యువ రైతుల కోసం నిర్వహించిన శిక్షణలో అనేక ప్రయోజనాలతో వర్మికంపోస్టు తయారీ గురించి క్షుణ్ణంగా అవగాహన కల్పించడం జరిగిందని శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ మంజుల, వీఏఎస్ డాక్టర్ సి.హెచ్. గిరనాథ్, కేవీకే శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

వివాదరహితంగా తీర్చిదిద్దడమే ధ్యేయం



రెవెన్యూ సదస్సును నిర్వహిస్తున్న జిల్లా సర్వేయర్ భరత్‌కుమార్, తదితరులు

కురబలకోట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామాలను వివాదరహితంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా సర్వేయర్ భరత్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని చింతమాకుపల్లెలో గ్రామరెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా గ్రామాల్లో నెలకొన్న వివిధ రకాల భూ సమస్యలతో పాటుగా వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయని, వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల సమస్యలపై 35 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, తహసీల్దార్ తపస్విని, డీటీ శాంతమ్మ, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ భువనేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి





సంఘటనా స్థలంలో మృతి చెందిన రైతు సూర్యనారాయణ (ఫైల్)

ములకలచెరువు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని బొలెరో లగేజీ వాహనం ఢీకొనడంతో ఓ రైతు దుర్మరణం చెందిన సంఘటన ముంబై-చెన్నై జాతీయ రహదారిలోని పెద్దపాళ్యం వంతెన వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని పెద్దపాళ్యం పంచాయతీ గొళ్లపల్లెకు చెందిన కొండా సూర్యనారాయణ (55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య శాంతమ్మ, కుమారుడు రంజిత్‌కుమార్, కుమార్తె రజనీ ఉన్నారు. కాగా మదనపల్లెలో ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్న తన కుమారుడికి బస్సులో కూరగాయలు పంపేందుకు ఆ రైతు ద్విచక్ర వాహనంలో కదిరినాధునికోట బస్టాప్ వద్దకు బయలుదేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారి దాటి రోడ్డు పక్కకు వెళ్తున్న సమయంలో వేగంగా వచ్చిన బొలెరో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ నరసింహుడు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైతు మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

మా షాపులో కొంటే.. కేసులుండవు..

- బెల్టు షాపుల నిర్వాహకులకు మద్యం దుకాణ యజమానుల భరోసా
- గ్రామాల్లో బెల్టుషాపుల జోరు



గుర్రంకొండ జీవన్‌తోపు రోడ్డు మార్గంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణాలు

గుర్రంకొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ పట్టణం, గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. మద్యానికి పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. దీంతో మద్యం దుకాణదారులు ఇష్టానుసారంగా మద్యాన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ప్రతి పంచాయితీ పరిధిలో జనాభా ఉన్న ప్రతి గ్రామంలో రెండు నుంచి మూడు బెల్టు షాపులను అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం బెల్టు షాపులను నిర్వహిస్తే బెల్టు తీస్తామంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నా గ్రామస్థాయిలో అమలు కావడం లేదన్న ఆరోపణలున్నాయి. అంతేకాకుండా మద్యం దుకాణదారులు తమదంటే తమ దుకాణంలో మద్యం తీసుకెళ్లాలంటూ బెల్టు షాపుల నిర్వాహకులకు పోటీ పడి మరీ మద్యం ఇస్తున్నారు. తమ దుకాణంలో మద్యం తీసుకొంటే ఎక్సైజ్, పోలీసులు పట్టుకుంటే మేమే అండగా ఉంటూ కేసులు లేకుండా చూస్తామని దుకాణదారులు బెల్టుషాపు నిర్వాహకుల్లో ధైర్యాన్ని నింపుతున్నారు. దీంతో బెల్టు షాపు నిర్వాహకులు మద్యం దుకాణదారుల మధ్య పోటీని గమనించి వారం ఓ షాపులో, రెండవ వారం మరో షాపులో మద్యాన్ని తీసుకెళుతున్నారు. అంతేకాకుండా బెల్టు షాపుల నిర్వాహకులకు మద్యం అప్పుగా ఇవ్వడం కొసమెరుపు. ఈ క్రమంలో ఊరురా మద్యం అమ్మకాల కోసం బెల్టుషాపులు విచ్చలవిడిగా వెలిశాయి. అంతేకాకుండా ప్రభుత్వం పర్మిట్‌రూములకు పర్మిషన్ ఇవ్వకపోయినా అనధికారికంగా మద్యం దుకాణాల పక్కనే రూములు ఏర్పాటు చేసుకుని అక్కడే మద్యం తాపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

గుర్రంకొండ మండలంలో 15 పంచాయతీల్లో సుమారు 33వేల మంది ఓటర్లు ఉన్నారు. జనాభా ప్రాతిపదికన మండలానికి ప్రభుత్వం మూడు మద్యం దుకాణాలను మంజూరు చేసింది. ఇందులో రెండు మద్యం షాపులను మండలానికి చెందిన వారు దక్కించుకున్నారు. ఒక షాపును మదనపల్లెకు చెందిన వ్యక్తి దక్కించుకున్నాడు. ఈ నేపథ్యంలో గుర్రంకొండ పట్టణం జీవన్‌తోపు రోడ్డు మార్గంలో రెండు మద్యం షాపులను ఏర్పాటు చేశారు. అలాగే మదనపల్లెకు చెందిన వ్యక్తి మూడవ షాపును తరిగొండ గ్రామంలోని రామాపురం రోడ్డులో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మద్యం అమ్మకాలను పెంచుకోవడానికి నిర్వాహకులు ఇష్టానుసారంగా బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

విద్యార్థులు, మహిళలకు కష్టాలు..

గుర్రంకొండ జీవన్‌తోపు రోడ్డు మార్గంలో రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ప్రైవేట్ డిగ్రీ కాలేజీ ఉంది. ఈ కాలేజీకి వందలాది మంది విద్యార్థులు ప్రతిరోజు వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం పూట విద్యార్థులు ఈ మార్గంలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను ఉంచడంతో రద్దీగా ఉంటూ మద్యం ప్రియులతో గందరగోళంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యార్థినులు కాలేజీకి పోయి రావాలంటే ఇబ్బందిగా ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

కేసు నమోదు చేస్తాం..

గుర్రంకొండ మండలంలోని గ్రామాల్లో బెల్టుషాపులను నిర్వహిస్తే వారిపై కేసు నమోదు చేస్తాం. అలాగే మద్యం దుకాణాల వద్ద కానీ, పక్కన కానీ కూర్చుని తాగడానికి అనుమతి లేదు. దుకాణాల వద్ద మద్యం తాగుతున్నట్లైతే వాటిని తొలగిస్తాం. గ్రామాల్లో తిరిగి బెల్టుషాపులు లేకుండా రూపుమాపుతాం.

\- లత, ఎక్సైజ్ సీఐ, వాల్మీకిపురం సర్కిల్

రేయింబవళ్లు కష్టపడి పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది దిగుబడి బాగుంటే ధర ఉండదని.. ధర ఉంటే దిగుబడి ఉండదని వాపోతున్నారు. ఇలా అయితే వ్యవసాయం చేయడం కష్టమని.. ఏ పంటా సాగు చేయలేమని.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


రాశిగా పోసిన వరి ధాన్యం

దిగుబడి బాగుంది... ధర పడిపోయింది

- గత ఏడాది పుట్టి ధాన్యం రూ.16 వేలు
- ఈ ఏడాది రూ.10 వేలకు పడిపోయిన ధర
- ప్రైవేటు వ్యాపారస్థుల దోపిడీ
- ఆవేదనలో రైతన్నలు.. ● పట్టించుకోని ప్రభుత్వాలు

చాపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మండలంలో కేసీ కెనాల్, చాపాడు చానెల్ కింద ఖరీఫ్ సీజన్‌లో సుమారు 26 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట కోత దశకు చేరుకుంది. జగిత్యాల, బీపీటీ 5204, నన్నాలు, జిలకర వంటి రకాలను సాగు చేశారు. రైతులు వరి కోత మిషన్ల ద్వారా కోతలు కోస్తున్నారు. ఎకరాకు 30 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. కడప, చెన్నై, బెంగుళూరుకు చెందిన వ్యాపారులు పుట్టి (8 బస్తాలు) రూ.10,500 నుంచి రూ.11,300 వరకు ధర పెట్టి వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది పుట్టి వరి ధాన్యం రూ.16 వేలు ధర పలకగా.. ఇప్పుడు దాదాపు రూ.5 వేలు ధర తక్కువగా ఉందని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి బాగుందని సంతోషపడితే.. ధర ఒక్కసారిగా పడిపోవడంతో తమ ఆశలు అడియాశలయ్యాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక ఎకరా సాగుకు సుమారు 30 వేలు ఖర్చు అయ్యిం దని.. ప్రభుత్వం వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవంతో వ్యాపారస్థులు ఇష్టానుసారంగా అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని వాపోతున్నారు. లక్ష్మీపేట, సోమాపురం, కేతవరం, చాపాడు, చియ్యపాడు, విశ్వనాథపురం, భద్రిపల్లె తదితర గ్రామాల వద్ద కోతలు కోస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షం వస్తుందేమోనని భయంతో రైతులు వరి ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. ఇళ్లలో నిలువ చేసుకునేందుకు స్థలం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా మద్దతు ధర పెంచి, పుట్టి రూ.16 వేలకు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.


సంచుల్లో నింపిన వరి ధాన్యం


కోత దశకు చేరుకున్న వరి పైరు

పుట్టి రూ.16 వేలకు కొనుగోలు చేయాలి



గత ఏడాది పుట్టి (8 బస్తాలు)ధాన్యం ధర రూ.16వేలు పలికితే... ఇప్పుడు ప్రైవేటు వ్యాపారస్థులు రూ.10,500లకు కొనుగోలు చేస్తున్నారు. ఎకరా వరి సాగు చేసినందుకు రూ.30వేలు ఖర్చు అయ్యింది. నాలుగు నెలలపాటు కష్టపడితే రూ.10వేలు మిగులుతున్నాయి. ఇలా అయితే ఎలా వ్యవసాయం చేసేది. ప్రభుత్వం పుట్టి రూ.16 వేలకు కొనుగోలు చేయాలి.

- శ్రీనివాసులు, రైతు, కేతవరం గ్రామం

వ్యాపారస్థులు చెప్పిందే ధర



వరి ధాన్యం కొనుగోలులో ప్రైవేటు వ్యాపారస్థులు చెప్పిందే ధర.వాళ్లు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సి వస్తోంది. పుట్టి రకాన్ని బట్టి రూ.10,500 నుంచి రూ.11,300లకు కొనుగోలు చేస్తున్నారు. దిగుబడి బాగుందిలే అనుకుంటే ధర ఒక్కసారిగా తగ్గించారు. నిల్వ చేసుకుందామనుకుంటే వాన భయం పట్టుకుంది. ప్రభుత్వం రూ.16 వేలకు కొనుగోలు చేయాలి.

- దస్తగిరి, రైతు, కేతవరం గ్రామం

నైపుణ్యాలు పెంపొందించేందుకు ఇంటర్న్‌షిప్, నైపుణ్యాభివృద్ధి కోర్సులు


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వైవీయూ, హైదరాబాద్ సంస్థల ప్రతినిధులు

కడప, ఎడ్యుకేషన్ డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించేందుకు ఇంటర్న్‌షిప్, నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రవేశ పెడుతున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం వైవీయూ వీసీ చాంబర్‌లో హైదరాబాద్ స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ ప్రైవేట్ సంస్థతో వైవీయూ ఒప్పందం కుదుర్చుకుంది. వీసీ సమక్షంలో రిజిస్ట్రార్ పద్మ, స్కిల్ డిజైర్ సంస్థ సంచాలకులు శ్రీకాంత్ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంఓయూ ద్వారా నైపుణ్యాభివృద్ధి కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లు నిర్వహిస్తామన్నారు. మద్రాస్ ఐఐటీ మోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందన్నారు. వైవీయూ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ అనుబంధ కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అభివృద్ధి చేయడం ఈ ఒప్పంద ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి, యూనివర్సిటీ డీన్ కేజీ దాము, గంగయ్య, డాక్టర్ వెంకట రమణ, డాక్టర్ రెడ్డయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు ఎలాంటి సమస్య లేదు : డీఎంహెచ్‌ఓ


ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీని సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

వేంపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు ఎలాంటి సమస్య లేదని, తల్లిదండ్రులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు తెలిపారు. కొద్దిరోజులుగా ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారని పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆరాతీసి ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీని బుధవారం సందర్శించింది. డీఎంహెచ్‌ఓ నాగరాజు, పులివెందుల ఇన్‌చార్జి ఆర్డీవో చిన్నయ్య, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత మొదట ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ ఇతర అధికారులతో సమావేశమై చర్చించారు. ట్రిపుల్‌ఐటీలో చదువుతున్న విద్యార్థులు, ఒంగోలు క్యాంపస్ విద్యార్థులతో మాట్లాడారు. ఆస్పత్రిని సందర్శించి స్థానిక వైద్యులతో మాట్లాడారు. మెస్, నీటి సరఫరా ప్రాంతాలను పరిశీలించారు. ఫుడ్ పాయిజన్ ఎవరికీ కాలేదని నిర్ధారించుకున్నారు. పాత క్యాంపస్‌లో ఉన్న ఒంగోలు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఇక్కడి మసాలాలు పడకపోవడం వల్ల కొందరికి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వచ్చాయని, మిగిలిన విద్యార్థులకు ఎలాంటి సమస్య లేదని డైరెక్టర్, వైద్యులు ఉన్నతాధికారులకు వివరించారు. మెస్‌లోని ఆహారపదార్థాలు, తాగునీటి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. కాగా ఒంగోలు క్యాంపస్‌లో మసాలాలు తగ్గించాలని, క్యాంటీన్లను ఏర్పాటు చేస్తే బయటి ఫుడ్‌కు వెళ్లాల్సిన అవసరం ఉండదని అధికారులకు విద్యార్థులు విన్నవించారు. కలెక్టర్‌ను కలిసి క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


వినోద్‌కుమార్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

మైదుకూరు రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యనభ్యసించి... ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన పలువురిని కలచివేసింది. మైదుకూరు మండలం జీవిసత్రం పరిధి లక్ష్మీనారాయణ పురం గ్రామానికి చెందిన వెంకట రమణారెడ్డికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు వినోద్‌కుమార్ రెడ్డి (22) బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. బుధవారం తెల్ల వారుజామున సొంత పని నిమిత్తం మైదుకూరు వెళుతున్న తన తండ్రిని వదిలిపెట్టేందుకు బైక్‌పై బయలుదేరాడు. గడ్డంవారిపల్లె వద్దకు వెళ్లగానే వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొంది. దీంతో వినోద్‌కుమార్ రెడ్డి అక్కడిక్కడే మృతి చెందగా, వెంకట రమణారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ మురళీయాదవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి మృతి



సికెదిన్నె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఉరి వేసుకుని యూసఫ్‌బాష(37) అనే వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని ఎఎల్‌కాలనీలో గత కొంత కాలంగా యూసఫ్‌బాష ఒంటరిగా ఉంటున్నాడు. కడప నగరానికి చెందిన ఇతను భార్య, పిల్లలతో విడిపోయి... డ్రైవర్‌గా పనిచేస్తూ ఇక్కడ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఓనర్ వద్ద బైక్ తీసుకుని వచ్చి ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

సికెదిన్నె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటు కూరు రింగు రోడ్డు సమీపంలో బుధవారం రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఏరువాక కేంద్రంలో పనిచేసే పూర్ణచంద్ర, మరో వ్యక్తి బైక్‌లు అదుపు తప్పి ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ప్రైవేటు వాహనాల్లో రిమ్స్‌కు తరలించగా.. మెరుగైన చికిత్స కోసం పూర్ణచంద్రను తిరుపతికి తరలించినట్లు తెలిసింది. మరో వ్యక్తి సమాచారం తెలియాల్సి ఉందని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సికెదిన్నె పోలీసులు తెలిపారు.

దాడి కేసులో నలుగురు అరెస్టు

కడప(క్రైం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో గత నెల 16న జరిగిన దాడి కేసుకు సంబంధించి నలుగురిని అరెస్టు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. గత నెల 16వ తేది రాత్రి చిలకలబావి వద్ద అరబత్‌ను ఇలియాస్, సలీమ్, బన్నీ, తాజ్‌లు దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

పోరుమామిళ్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లకు చెందిన కట్టమూరి శిరీష్ అనే వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. పోరుమామిళ్ల మండలంలోని రామిరెడ్డిగుంటకు చెందిన నాగిరెడ్డి శంకర్‌రెడ్డి అనే వ్యక్తి దగ్గర నుంచి కట్టమూరి శిరీష్ 2022 సంవత్సరంలో రూ.45 లక్షలకు సంబంధించి 90 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి అడ్వాన్స్‌గా రూ.20 లక్షలు ఇచ్చాడు. మిగిలిన రూ.25 లక్షలు ఇవ్వకుండా ఇబ్బంది కలుగజేస్తున్నాడని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తల్లి హత్య కేసులో తనయుడి అరెస్టు

పెద్దమండ్యం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తల్లి హత్య కేసులో తనయుడి (ఓబులేసు)ని అరెస్టు చేసినట్లు ములకలచెరువు సీఐ లక్ష్మన్న వెల్లడించారు. సీఐ వివరాల మేరకు.. పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లి గ్రామంలో బోడెం ఓబులేసు మద్యానికి బానిసై తల్లి ఓబులమ్మ(60)ను డబ్బుల కోసం వేధించేవాడు. ఈ క్రమంలో ఆమె డబ్బులు ఇవ్వలేదని కోపంతో కర్రతో దాడి చేశాడు. తలకు, కాళ్లకు క్రూరంగా కొట్టడంతో రక్తపుమడుగులో పడిపోయింది. గ్రామస్థులు గుర్తించి పెద్దమండ్యం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఓబులమ్మకు చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తిరిగి ఇంటికొచ్చిన రెండు రోజుల తరవాత ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. కాగా నవంబరు 24న వృద్ధురాలు ఓబులమ్మ బంధువుల ఫిర్యాదు మేరకు పెద్దమండ్యం ఎస్ఐ పీవీ రమణ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తు ములకలచెరువు సీఐ లక్ష్మన్న ఆధ్వర్యంలో వేగవంతం చేశారు. నిందితుడి కోసం పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో బుధవారం నిందితుడు ఓబులేసును పెద్దమండ్యం బస్టాప్ వద్ద అరెస్టు చేసి కోర్టుకు తరలించగా రిమాండ్‌కు ఆదేశించించినట్లు సీఐ తెలిపారు.

ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప మారుతీనగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేసి ఆయా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. విద్యుత్‌రంగం ప్రైవేటీకరణ, ఉద్యోగుల సమస్యలపై ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సదస్సు జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామలింగారెడ్డి, శివయ్య, బాలకాశి మాట్లాడారు. విద్యుత్ రంగం ప్రైవేటీకరణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెనుమార్పులకు శ్రీకారం చుడుతున్నాయన్నారు. ఈ రంగాన్ని పూర్తిగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు వేగంగా పావులు కదుపుతున్నతీరు సరికాదన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ముందుగా ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు ప్రీపెయిడ్ మీటర్లు తీసుకువచ్చారన్నారు. అదే తరహాలో గృహాలకు కూడా తీసుకురానున్నారని వెల్లడించారు. నిత్యావరమైన విద్యుత్‌ను ప్రైవేటు వారికి ధారాదత్తం చేస్తే ప్రజలతో పాటు దేశ భద్రత కూడా ప్రమాదంలో పడుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, యూనియన్ డిస్కం కార్యదర్శి సురేష్, జిల్లా నాయకులు నాగిరెడ్డి, సురేష్, హరికేశవరెడ్డి, కేశవ, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రామలింగారెడ్డి

పెండ్లూరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

వేముల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెండ్లూరు గ్రామంలో మంగళవారం ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ సుదర్శన్‌రెడ్డిపై అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరత్నమ్మ విచారణ చేపట్టారు. ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై పెద్దఎత్తున అవినీతి చేసినట్లు ఆధారాలతో ఆ గ్రామ నాయకులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారణ చేపట్టేందుకు మంగళవారం గ్రామానికి వచ్చిన అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరత్నమ్మ విచారణలో ఫిర్యాదుదారులపైనే శివాలెత్తడంతో వారు ఆశ్చర్యం వ్యక్తం చేశా రు. విచారణలో ఆధారం చూపుతుంటే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉపాధి హామీ పథకంలో పనిచేయకూడదనే నిబంధన ఉన్నప్పటికీ పనిచేసినట్లు ఎఫ్‌ఏ నమోదు చేశాడని చెప్పగా.. విచారణ అధికారి నాగరత్నమ్మ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కేవలం రూ.5వేలు, రూ.6వేలు డబ్బులు జీతం వస్తుందని అటువంటి వారు పనిచేయకూడదా అంటూ ఫిర్యాదుదారులపైనే ఎదురు ప్రశ్నించారు. అలాగే పలు ఆధారాలను ఆమె ముందు ఉంచగా నేనేమైనా లైట్లు వేసుకొని చూడాలా మీరే ఇవ్వండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తేలిసింది. అలాగే ప్రభుత్వం మారిన వెంటనే ఎఫ్‌ఏను ఎందుకు తొలగించాలని ఫిర్యాదుదారులనే ఎదురు ప్రశ్నించడంతో ఇదెక్కడి న్యాయమంటూ ఫిర్యాదు దారులు ఆగ్రహంతో విచారణ నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం ఫిర్యా దుదారులైన అవేంద్రరెడ్డి, చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ మేము పూర్తిస్థాయిలో ఆధారాలతో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన ఆధారాలు అన్నింటిని ఉపాధి హామీ అధికారులు ముందుగానే ఆ ఎఫ్‌ఏ సుదర్శన్‌రెడ్డికి పంపించడం జరిగిందని.. అలాగే విచారణకు వచ్చిన ఏపీడీ పూర్తిస్థాయిలో వన్‌సైడ్‌గా విచారణ చేస్తోందని తెలిపారు. ఏపీడీ నాగరత్నమ్మను తప్పించి మరో విచారణ అధికారిని నియమించి పూర్తిస్థాయిలో విచారణ చేయాలని వారు జిల్లా అధికారులను కోరారు.

ఈడబ్ల్యూఎస్ శాఖలోకి ఆరు కార్పొరేషన్లు

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన శాఖ (ఈడబ్ల్యూఎస్) పరిధిలోకి ఆరు కార్పొరేషన్లను తీసుకొస్తూ బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ రెడ్డి సంక్షేమ కార్పొరేషన్, కమ్మ సంక్షేమ కార్పొరేషన్, బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్, క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్, ఆర్యవైశ్య కార్పొరేషన్, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్పొరేషన్లను పాలనకు అనుకూలంగా ఈడబ్ల్యూఎస్ శాఖ పరిధిలోకి తీసుకొచ్చారు.

డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ శిక్షణ

- ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వివిధ పాఠశాలల్లో ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించనుంది. ఈ డీఎస్సీ పరీక్షల కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులకు 26 జిల్లాల్లో బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా కోచింగ్ ఇస్తున్నారు. ఇప్పుడు అదనంగా ఆన్‌లైన్ విధానంలో కూడా శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఈమేరకు ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వగలిగిన కోచింగ్ సంస్థల నుంచి టెండర్లు కూడా పిలిచారు. ఈ నెల 12 నుంచి 20వ తేదీ లోపు ఆన్‌లైన్ విధానంలో టెండర్ వేయాలని ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మాతృభాష పరిరక్షణ అందరి కర్తవ్యం

కడప, ఎడ్యుకేషన్ డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాతృభాష పరిరక్షణ అందరి కర్తవ్యమని ఆంధ్రాయూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ ఆదినారాయణ తెలిపారు. బుధవారం వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూని వర్సిటీలో భారతీయ ఉత్సవ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు భాష ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం డాక్టర్ శివరామ సురేంద్రశర్మ మాట్లాడుతూ అవగాహన ప్రక్రియ తెలుగుభాషకు మాత్రమే ప్రత్యేకవరమని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ వై.వర లక్ష్మి, డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, ఉదయ్‌ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పులివెందులలో డమ్మీ తుపాకీతో హల్‌చల్

- బాకీ డబ్బులు అడిగినందుకు వ్యక్తిపై దాడి

పులివెందుల టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాకీ డబ్బులు అడిగినందుకు డమ్మీ తుపాకీతో ఓ వ్యక్తి తలపై కొట్టి గాయపరిచిన సంఘటన పులివెందులలో చోటుచేసుకుంది. బుధవారం పట్టణంలోని లయోల డిగ్రీ కళాశాల సమీపంలో క్లబ్ దగ్గర ఆర్.తుమ్మలపల్లె గ్రామానికి చెందిన నాగిరెడ్డి తనకు బాకీ ఉన్న డబ్బులు ఇవ్వాలని శివప్రసాద్‌ను అడగడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. శివప్రసాద్ తన మిత్రుడు చక్రధర్‌రెడ్డి అలియాస్ బబ్లూకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో బబ్లూ అక్కడకు వచ్చి నాటు తుపాకీతో నాగిరెడ్డి తలపై కొట్టి తీవ్రంగా గాయ పరిచాడు. బాధితుని స్థానికులు వైద్యం కోసం పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తర లించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పులివెందులలో జరిగిన సంఘటనపై నాటు తుపాకీ హల్‌చల్ అని సోషల్ మీడియాలో రావడంపై సీఐ స్పందించారు. అది డమ్మీ బొమ్మ తుపాకీ అని తెలిపారు. ఈ సంఘటనకు కారకులైన శివప్రసాద్, చక్రధర్‌రెడ్డి అలియాస్ బబ్లూలపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


గాయపడిన నాగిరెడ్డి

ముగిసిన స్పోర్ట్స్ మీట్

సిద్ధవటం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీ 11వ పోలీసు బెటాలియన్‌లో ఈ నెల 9 నుంచి నిర్వహించిన స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2024 బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జి బెటాలియన్ కమాండర్ నాగేశ్వరప్ప మాట్లాడుతూ ఈ క్రీడా పోటీల్లో అందరూ విజేతలే అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కె.వెంకటరెడ్డి, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

సిద్ధవటం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) మండలంలోని పోలీసు బెటాలియన్ పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని బుధవారం మండల విద్యాశాఖ అధికారి-2 అరుణ తనిఖీ చేశారు. ఆ పాఠశాల హెడ్మాస్టర్ నాగమునిరెడ్డితోపాటు వంట ఏజెన్సీ నిర్వాహకులకు మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి మీనాక్షి తాఖీదులు జారీ చేశారు. దీంతో ఎంఈవో మెనూ తనిఖీ చేసి సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై నేడు శిక్షణ

సిద్ధవటం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) ఈనెల 12 నుంచి 13వ తేదీ వరకు మండల పరిషత్ సభాభవనంలో రెండు రోజుల పాటు స్థానికీకరణ, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మెహతాజ్ యాస్మిన్ తెలిపారు. సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి ఈ శిక్షణ కార్యక్రమంపై అవగాహన కల్పించి, అందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

లక్కిరెడ్డిపల్లె: స్థానిక మండల పరిషత్ సభా భవనంలో గురువారం లోకలైజేషన్ సస్టైనబుల్ డెవలప్మెంట్.. గోల్స్‌పై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సీనియర్ అసిస్టెంట్ రహీమ్‌సాహెబ్ ఒక ప్రకటనలో తెలిపారు.సచివాలయ సిబ్బంది, అధికారులు, సర్పంచులు హాజరుకావాలన్నారు.

అద్దె భవనాలే దిక్కు!

- సొంత భవనాలకు నోచుకోని ప్రభుత్వ కార్యాలయాలు
- ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు
- ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి

సుండుపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు అద్దె భవనాలే దిక్కయ్యాయి. ఆయా భవనాల్లో తగిన వసతులు లేక ఉద్యోగులతోపాటు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల తరబడి ఇదే పరిస్థితి కొనసాగుతుండడంపై మండల వాసుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

సుండుపల్లె మండలం జిల్లాలోనే అత్యంత మారుమూల మండలం. 14 గ్రామ పంచాయతీలున్న ఈ మండలంలో 50 వేలకు పైగా జనాబా ఉంటుంది. మండల వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి ఇక్కడి తహసీల్దారు కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఈ భవనంలో తగిన సదుపాయాలు లేకపోవడంతో అధికారులందరూ ఒకే సమయంలో కార్యాలయంలో కూర్చుని సేవలందించే పరిస్థితి లేదు. దీంతో గ్రామాల నుంచి తహసీల్దారు కార్యాల యానికి వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవనానికి ప్రభుత్వం నెలకు రూ.10 వేలు అద్దె చెల్లిస్తోంది. మండల కేంద్రంలో 1995 నుంచి సబ్ రిజిస్ట్రార్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అయి తే, ఇప్పటివరకు ఈ కార్యాలయానికి శాశ్వత భవ నం లేదు. సుమారు 29 ఏళ్లుగా ఈ కార్యాలయాన్ని అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనానికి నెలకు రూ.10,619 అద్దె చెల్లిస్తున్నారు. ఈ కార్యాలయాలు నిర్వహించే భవనాల ఇరుకుగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద రద్దీ అధికంగా ఉంటున్నా, అధికారులు సొంత భవన నిర్మాణంపై దృష్టి పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.





తహసీల్దార్ కార్యాలయం నిర్వహిస్తున్న అద్దె భవనం (ఇన్‌సర్ట్) రిజిస్ట్రార్ కార్యాలయ భవనం

ఎట్టకేలకు ప్రతిపాదనలు

తహసీల్దార్ భవన నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు అధి కారులు చెబుతున్నారు. దీంతో కూటమి నేతలు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. ప్రభుత్వం అనుమతులిచ్చి నిధులు మంజూరు చేస్తే సమస్య పరిష్కారమవుతుందని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

శాశ్వత భవనం లేకపోవడం బాధాకరం



14 గ్రామ పంచాయతీలు కలిగిన మండలంలో రెవెన్యూ కార్యాలయానికి శాశ్వత భవనం లేకపోవడం బాధాకరం. గదులు సరిగా లేకపోవడం సమస్యగా మారిందని అధికారులు చెబుతున్నారు.

\- మూడే రాజమ్మ, ఎంపీపీ, సుండుపల్లె

ప్రతిపాదనలు పంపించాం



తహసీల్దార్ కార్యాలయానికి శాశ్వత భవనం నిర్మాణానికి రెండు నెలల క్రితం ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం. శాశ్వత భవనం ఏర్పాటైతే ఎంతో మేలుగా ఉంటుంది.

\- రెడ్డెన్న, డిప్యూటీ తహసీల్దార్, సుండుపల్లె

బీజేపీయేతర రాష్ట్రాలపై కక్ష సాధిస్తున్న కేంద్రం

- వామపక్ష నేతల ఆరోపణ

రాయచోటిటౌన్, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): కేరళతో పాటు బీజేపీయేతర రాష్ట్రాల ప్రజల హక్కులు పరిరక్షించాలని, ప్రత్యామ్నాయ వామపక్షాలను బలోపేతం చేయాలనే నినాదంతో సీఐటీయూ, అఖిల భారత కిసాన్ సభ, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పీ. శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రామచంద్ర మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీజేపీయేతర ప్రభుత్వాలపై కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. నిధులు ఇవ్వకపోవడమే గాక గవర్నర్‌ను అడ్డం పెట్టుకొని కేరళ రాష్ట్ర అసెంబ్లీ పాస్ చేసిన బిల్లులను తొక్కిపెడుతోందని విమర్శించారు. కేరళలోని భారత పెట్రోలియం లాంటి భారీ పరిశ్రమను అమ్మకానికి సిద్ధపడిన కేంద్ర ప్రభుత్వం సంవత్సరం పాటు ఆందోళన చేస్తే వెనక్కి తగ్గిందన్నారు. త్రివేండ్రం విమానాశ్రమాన్ని అదానీకి అప్పజెప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళలో తీవ్ర వర్షాల వలన వయనాడ్‌లో కొండ చరియలు విరిగి 400మంది చనిపోవడమే గాక, నాలుగు జిల్లాలు పూర్తిగా మునిగిపోతే జాతీయ విపత్తుగా పరిగణించలేదన్నారు. అనంతరం మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీరమణ, పట్టణ అధ్యక్షులు మద్దెల చెన్నయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కే. నాగబసిరెడ్డి, సీఐటీయూ నాయకులు సిద్దిమల్లు సిద్దయ్య, శ్రీను, నాగరాజు, వడ్డెర సంఘం నాయకులు చల్లా రెడ్డెయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రమణ, పెద్ద వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు

నీటిపారుదల సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు

చిన్నమండెం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశాపురం, చిన్నమండెం గ్రామ పంచాయతీల పరిధిలోని సాగునీటి సంఘాల సభ్యులకు శనివారం ఉదయం 8 గంటలకు కేశాపురం గ్రామ పంచాయతీలోని మండల ప్రాథమిక పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శేఖర్‌నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా సాగునీటి సంఘాలకు టీసీ మెంబర్లు అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని, చాకిబండ పెద్దచెరువు వినియోగదారుల సంఘంలోని ఆయకట్టుదారులు పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవచ్చునని ఎంపీడీవో తెలిపారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసేవారు నీటి పన్ను బకాయిలు లేవని గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా ధ్రువీకరణ పత్రం తీసుకుని ఎన్నికల అధికారికి సమర్పించాలని, ఓటర్లందరూ పాసుబుక్, ఆధార్‌కార్డుతో శనివారం హాజరు కావాలని ఆయన తెలిపారు.

రెమ్యునరేషన్ చెల్లింపులో అలసత్వం తగదు

రాయచోటిటౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): 2023 ఏప్రిల్ స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన టీఏ, డీఏతో పాటు , రూ 18 లక్షల రెమ్యునరేషన్‌ను రెండేళ్లు కావస్తున్నా చెల్లించకపోవడం అన్యాయమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయంపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌తో పాటు విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రెమ్యునరేషన్ చెల్లింపులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాయచోటి మం డల ప్రధాన కార్యదర్శి రాజారమేశ్, చిన్నమండెం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి దృష్టికి నందలూరు సమస్యలు

నందలూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మను బుధవారం ఢిల్లీలో కలిసి నందలూరులోని ప్రధాన సమస్యలను వివరించినట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందలూరులో మూతపడిన లోకోషెడ్, ఆల్విన్ కర్మాగారాలకు ప్రత్యామ్నాయంగా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. రెండు చోట్ల పరిశ్రమలు నెల కొల్పితే నిరుద్యో గులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ నాయకులు షబ్బీర్‌అహ్మద్, పోతురాజు మస్తానయ్య, హిమగిరినాథ్ యాదవ్, టీడీపీ నాయకులు మోడపోతుల రాము పాల్గొన్నారు.



మంత్రిని కలిసిన బీజేపీ నేతలు

బాల్య వివాహాలను అరికట్టాలి

వీరబల్లి, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టాలని ఏపీఎం ఖాదర్‌వలి అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన వీరబల్లి గ్రామ సమాఖ్య-1 ఈసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడపిల్లల ఎదుగుదలకు అడ్డపడడం వల్ల భవిష్యత్‌లో అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఆడపిల్లలను అన్ని కోణాల్లో మగ పిల్లలతో సమానంగా చూసుకోవాలని కోరారు. సమాజంలో మహిళల పట్ల వివక్ష చూపరాదని కోరారు. అందరూ పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందన్నారు. బాల్య వివాహాలు వద్దేవద్దని మహిళలు ర్యాలీ చేశారు. సీసీలు సుధాకర్, గంగాధర్, వీఏఏ ప్రభాకర్, సభ్యులు పాల్గొన్నారు.

13న వైసీపీ ఉద్యమబాట

రాయచోటిటౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురైన అన్నదాతలకు అండగా నిలవాల్సిన అవసరం ఏర్పడిందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వానికి కనువిప్పు కలిగించడమే లక్ష్యంగా ఈ నెల 13న శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నామన్నారు. రైతులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆరు నెలల పాలనలోనే కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు ఇప్పటికే ప్రతి కుటుంబానికి రూ. లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు బాకీ పడ్డారని, ఈ బాకీలను ఎప్పుడు తీరుస్తారని ప్రశ్నించారు.

ఆయాలు, వాచ్‌మెన్ జీతాలు చెల్లించండి

పుల్లంపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, నైట్ వాచ్‌మెన్‌కు గత ఐదు నెలల నుంచి గౌరవ వేతనం చెల్లించకపోవడం వల్ల వారు ఇబ్బందులకు గురవుతున్నారని పీఆర్టీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మూడే సూర్యుడు నాయక్, శీపాల ఉమామహేశ్వర్ తెలిపారు. వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని తక్షణమే గౌరవ వేతనం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నాగారపు ఎల్లమ్మ గ్రామోత్సవం

పుల్లంపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని బావికాడపల్లె పంచాయతీ పచ్చవారిపల్లెలో బుధవారం నాగారపు ఎల్లమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకుడు సంజయ్‌గాంధీ సమర్పించిన ఎల్లమ్మ పంచలోహ విగ్రహానికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం డప్పు వాయిద్యాల మధ్య ఊరేగించారు.

'భగవద్గీత పారాయణంతో ప్రశాంత జీవనం'

రాజంపేట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) భగవద్గీత పారాయణంతో ప్రశాంత జీవనం సాధ్యమవుతుందని కేంద్ర మాజీ మంత్రి సాయిప్రతాప్ కుమార్తె, బీజేపీ నేత సాయిలక్ష్మి తెలిపారు. రాజంపేట బాలికల జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఆంగ్ల అధ్యాపకురాలు జి. సరిత ఆధ్వర్యంలో భగవద్గీత పారాయణం, భగవద్గీత పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అధ్యాపకురాలు సరిత విద్యార్థినులకు భగద్గీత పారాయణాన్ని నేర్పించి, సుమారు 30 వేలు విలువ చేసే భగవద్గీత పుస్తకాలను అందజేశారరు. విద్యార్థులు చిన్నతనం నుంచే భగవద్గీత పారాయణం చేస్తూ విద్యపై దృష్టి సారిస్తే ఉత్తమ ఫలితాలతో పాటు, సత్‌ప్రవర్తన అలవడుతుందన్నారు. అనంతరం భగవద్గీత పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెడ్మాస్టర్ శ్రీనివాసులు, అధ్యాకులు నరేష్, ప్రసన్నలక్ష్మి సుమలత తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను అందజేస్తున్న సాయిలక్ష్మి, సరిత

ఒంటిమిట్టకు నేడు ఎమ్మెల్యే ఆకేపాటి పాదయాత్ర

రాజంపేట టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి గురువారం ఒంటిమిట్ట పాదయాత్ర చేయనున్నారు. తన స్వగ్రామమైన ఆకేపాటి నుంచి ఒంటిమిట్ట కోదండరామాలయానికి పదేళ్లుగా ప్రతిఏటా ఆయన పాదయాత్ర చేస్తున్నారు. గురువారం ఉదయం 5 గంటలకు ఆకేపాడు ఆలయాల నుంచి పాదయాత్ర బయలుదేరి సాయంత్రం 3.30 గంటలకు ఒంటిమిట్టకు చేరుతుందని ఎమ్మెల్యే పీఏ మారుతిరావు తెలిపారు.

'పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం'

రాయచోటిటౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పోలీసు కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి అన్నారు. రాయచోటి నియోజకవర్గ పరిధిలోని లక్కిరెడ్డిరెడ్డిపల్లె పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కొండూరు సతీశ్‌కుమార్‌రాజు సతీమణి కొండూరు అఖిల భారతికి బుధవారం విడో ఫండ్ నుంచి రూ.50 వేలు, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.25 వేలు, ఐడీఆర్‌ఎఫ్ నుంచి రూ.ఒక లక్షతో కలిసి మొత్తం రూ.1.75 లక్షల చెక్కును అందజేశారు. బాధిత కుటుంబానికి పోలీసు డిపార్టుమెంట్ నుంచి అందాల్సిన ప్రయోజనాలు త్వరగా అందేలా చూస్తామని, ఏమైనా సమస్యలు ఉంటే నిరభ్యంతరంగా తనను గానీ, ఎస్పీని సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో కృష్ణుడు పాల్గొన్నారు.



కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

ముమ్మరంగా ఎన్జీవో సంఘం సభ్యత్వ నమోదు

సంబేపల్లె, డిసెంబరు11(ఆంధ్రజ్యోతి): రాయచోటి ఎన్జీవో తాలూకా పరిధిలోని సంబేపల్లె, చిన్నమండెం, రాయచోటి, సుండుపల్లె, వీరబల్లి మండలాల్లో ఎన్జీవో సభ్యత్వ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేస్తున్నట్లు రాయచోటి ఎన్జీవో తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం సంబేపల్లె మండలంలోని గున్నికుంట్ల, గురిగింజకుంట, దుద్యాల, శెట్టిపల్లె, రౌతుకుంట, సంబేపల్లె సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల ఉద్యోగుల నుంచి సభ్యత్వం స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం పోరాటం చేసి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో నాయకులు బడిశెట్టి దేవేంద్ర, డీవీ శివారెడ్డి, మహమ్మద్‌బాషా, రవిశంకర్, మహదేవలు పాల్గొన్నారు.

ఆలయంలో గదుల నిర్మాణానికి భూమిపూజ

సుండుపల్లె, డిసెంబరు11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విరూపాక్ష చెన్నకేశవస్వామి ఆలయంలో మాలేపాటి శివయ్య నాయుడు కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో గదుల నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. గదుల నిర్మాణం పూర్తయ్యేంతవరకు పూర్తిగా ఆర్థిక సాయం అందజేస్తానని మాలేపాటి రేణుకమ్మ, మాలేపాటి హరికృష్ణనాయుడు, మాలేపాటి అవినాశ్‌నాయుడు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాం నాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షుడు మాలేపాటి సురేశ్ నాయుడు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్, కురవ సంఘం మండల అధ్యక్షుడు మద్దికారి జయరామ్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న దాతలు

ప్రవచనకర్త ముకుందారెడ్డికి సన్మానం

నందలూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అరవపల్లెలో ఉన్న శ్రీకృష్ణ గీతామందిరంలో భగవద్గీత ప్రవచనకర్త ఆచోలి ముకుందారెడ్డిని ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి శంకర్ మంగళవారం రాత్రి ఘనంగా సన్మానించారు. శ్రీకృష్ణ గీతామందిరంలో ఈ నెల 4 నుంచి భగద్గీత ఆరో అధ్యాయంపై ముకుందారెడ్డి ప్రవచనం చేశారు. మందిర నిర్వాహకులు, విశ్రాంత తహసీల్దారు నాయన ఎల్లె జయన్న, గెలివి నాగరత్నంశెట్టి, భారత పురావస్తుశాఖ విశ్రాంత ఉద్యోగి రామాంజనేయులు, విశ్రాంత మండల అభివృద్ధి అధికారి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రోత్సహించాలి

నందలూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులను ప్రోత్సహిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తారని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ తెలిపారు. బుధవారం నాగిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలోని భవిత కేంద్రంలో మండల సమ్మిళిత విద్య ఉపాధ్యాయులు రంగస్వామి, వసుంధరదేవి ఆధ్వర్యంలో జనాబ్ ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రబాబు, బయాలజీ ఉపాధ్యాయుడు ఆనందాచారి, జాతీయ వికలాంగ క్రికెటర్ శివకోటి తదితరులు మాట్లాడుతూ దివ్యాంగ చిన్నారులను భవిత కేంద్రానికి పంపి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు, చిత్ర లేఖనం, నృత్య పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు అనుదీప్, ట్రస్టు అధినేత ఆసియా కలీమ్, ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ జంబు సూర్యనారాయణ

నేడు ఒంటిమిట్ట మండల సర్వసభ్య సమావేశం

ఒంటిమిట్ట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల అధ్యక్షురాలు అక్కి లక్ష్మీదేవి ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఒంటిమిట్ట మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలో ప్రధాన సమస్యలనుఈసమావేశంలో చర్చించి తీర్మానించనున్నట్లు వివరించారు. అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరు కావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక

నందలూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయి కౌశల్ క్విజ్ పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ నాగేశ్వరి తెలిపారు. క్విజ్ విభాగంలో పదో తరగతి విద్యార్థిని వెంకట శైలజా రేఖ, 9వ తరగతి విద్యార్థి నులు ప్రమీల, సాత్విక, రీల్స్ విభాగంలో పదో తరగతి విద్యార్థిని చైత్ర, పోస్టర్ మేకింగ్ విభాగంలో 9వ తరగతికి చెందిన చామంతి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని అన్నారు. ఈ నెల 30న విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు.



రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయినులు

పశువుల్లో గర్భకోశ వ్యాధులకు చికిత్స

ఓబులవారిపల్లె, డిసెంబ రు 11 (ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని బాలిరెడ్డిపల్లె గ్రామ పంచా యతీలో రాష్ట్రీయ గోకుల్ మిషన్, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచి త గర్భకోశ వ్యాధుల చికి త్స శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 41 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 32 గొర్రెలకు నట్టల నివారణ మం దులు, 19 పశువులకు సాధారణ మందులు అందజేశారు. అనంతరం పశువుల పెంపకం, అధిక పాల దిగుబడికి పాటించాల్సిన మెళకువలను సూచించారు. డీఎల్‌డీఏ డాక్టర్ శివరామిరెడ్డి, కోడూరు డాక్టర్ సురేష్‌రాజు, డాక్టర్ ప్రతాప్, ఓబులవారిపల్లె డాక్టర్ దుర్గా నాగమ్మ, సర్పంచ్ బాబుల్‌రెడ్డి, ఏహెచ్‌ఏలు మణికంఠ, హరిత, గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ఓబులవారిపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సంకల్ప 2024 పథకంలో భాగంగా చిన్నఓరంపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఇంటర్మీడియట్ కమిషనర్ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేశారు. తరగతిలో బీ గ్రేడ్, సీ గ్రేడ్ విద్యార్థులకోసం ఈ మెటీరియల్‌ను ప్రత్యేకంగా తయారు చేసి పంపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డీఆర్ హరిత తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛాలో జలకళ


పూర్తి నీటి సామర్థ్యంతో జలకళ సంతరించుకున్న ప్రాజెక్టు

- నీటితో కళకళలాడుతున్న ప్రాజెక్టు
- కాలువల్లోకి నీరు విడుదల
- కుంటలు, చెరువులు నింపడమే లక్ష్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

సుండుపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని ముడుంపాడు గ్రామ పంచాయతీ పింఛా నదిపై నిర్మించిన పింఛా ప్రాజెక్టు వర్షపు నీటితో కళకళలాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలతో పూర్తి సామర్థ్యంతో ప్రాజెక్టులోకి నీరు చేరింది. పది రోజులుగా దాదాపు 500 ఎస్టీఎంసీలు నీటిని నదికి విడుదల చేశారు. 2020 నవంబరు 26వ తేదీ అర్ధరాత్రి పై ప్రాంతాల నుంచి వచ్చిన వరదల కారణంగా పింఛా ప్రాజెక్టు మట్టికట్ట కొట్టుకుపోయింది. అప్పట్లో ప్రాజెక్టు దిగువ భాగంలో ఉన్న రైతులు చాలామందికి నష్టం వాటిల్లింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం తూతూ మంత్రంగా కొంతమందికి నష్టపరిహారం అందించి చేతులు దులుపుకుంది. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి ప్రాజెక్టు మరమ్మతులు చేసేందుకు అనుమతులు రాలేదు. మూడు సంవత్సరాలైనా వైసీపీ పాలకులు స్పందించలేదు. ఆ తర్వాత సీపీఐ ఆధ్వర్యంలో పింఛా నుంచి అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ వరకు వందలాది మంది రైతులు, రైతు కూలీలు, స్థానిక ప్రజలు, టీడీపీ, జనసేన, ప్రజా సంఘాలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. దీంతో 2023 మార్చి నెలలో రూ.84.33 కోట్లతో పనులు ప్రారంభించారు. రెండు నెలల క్రితం ప్రాజెక్టు పనులు దాదాపు పూర్తయిపోయాయి. త్వరగా పనులు పూర్తి చేసి నీటిని నిల్వ చేయాలని కూటమి నేతలు సంబంధిత అధికారులపై ఒత్తిడి తేవడం వలన కుడికాలువ గేటు ఏర్పాటు చేశారు. గేటు ఏర్పాటు పనులు జరుగుతుండగానే ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో నిండింది. రైతులకు మంచి రోజులు వచ్చాయి.

ప్రాజెక్టు ఎప్పుడు కట్టారంటే....

1954వ సంవత్సరంలో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టును 1960వ సంవత్సరంలో పూర్తి చేశారు. 1961వ సంవత్సరంలోనే ప్రాజెక్టును పరీక్షించి 1962వ సంవత్సరంలో పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేయడం ప్రారంభించారు. ప్రాజెక్టు మొత్తం సామర్థ్యం 0.327 ఎస్టీఎంసీలు. ఈ ప్రాజెక్టు కింద మొత్తం ఆయకట్టు 3,773.41 ఎకరాలు. ఈ ప్రాజెక్టుకు రెండు ప్రధాన కాలువలు కలవు. కుడికాలువ కింద 2211.41 ఎకరాల ఆయకట్టు ఉంది. కుడికాలువ ద్వారా అధికారికంగా 17 తూముల ద్వారా రైతులకు సాగునీరు అందిస్తోంది. ఎడమ కాలువ కింద 1562 ఎకరాల ఆయకట్టు భూమి కలదు. ఎడమ కాలువకు రెండు బ్రాంచ్ ఛానల్స్ ఉన్నాయి. మొత్తం అధికారికంగా 14 తూముల ద్వారా పంటలకు నీరు అందిస్తారు. పూర్తి సామర్థ్యంతో ప్రాజెక్టు నిండడం వలన మొత్తం ఆయకట్టు సాగు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం కుడి, ఎడమ కాలువల ద్వారా రైతులకు నీరు అందిస్తున్నారు.

కుంటలు, చెరువులకు జలకళ

పింఛా ప్రాజెక్టు మీద ఆధారపడి ఉన్న 12 కుంటలు, చెరువులు కూడా వర్షపు నీటితో కళకళలాడనున్నాయి. కుడి కాలువ ద్వారా ఒడ్డుకుంట, రెడ్డిచెరువు, రవ్వల కుంట, సుబ్బయ్యకుంట, పాలెంగడ్డ కుంటలు నిండి ఉన్నాయి. రెడ్డిచెరువు ద్వారా 90 శాతం ప్రాజెక్టు నీటితో ఇప్పటికే నిండింది. నీటిలో కళకళలాడుతోంది. ఎడమ కాలువ ద్వారా విడుదల చేసే నీటితో చిన్న నాగిరెడ్డికుంటలు రెండు, అత్తాకోడలు కుంటలు, కొత్తపల్లికుంట, అయ్యవారిచెరువు నిండనున్నాయి. ఈ చెరువులు, కుంటలు పూర్తి సామర్థ్యంతో నిండితే బోరు బావుల్లో పుష్కలంగా నీరు వచ్చి రైతులకు సాగునీటి సమస్య లేకుండాపోతాయి. అలాగే ఆ చెరువులు, కుంటల కింద ఉన్న సాగు భూములకు సాగునీటి సమస్యలు ఏర్పడవని రైతులు చెబుతున్నారు.


యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి పింఛా జలాశయం


కుడికాలువలో ప్రవహిస్తున్న నీరు

తాండాలకు వరప్రసాదిని

పింఛా, పెద్దినేనికాలువ, రాయవరం, మాచిరెడ్డిగారిపల్లె ప్రాంతాల ప్రజలకు పింఛా ప్రాజెక్టు వరప్రసాదిని. ముఖ్యంగా ఒకప్పుడు నాగరిక సమాజానికి దూరంగా ఉండే తాండాలు పింఛా ప్రాజెక్టు నిర్మాణంతో వారి దశ తిరిగింది. ప్రాజెక్టు నిర్మాణంతో సుండుపల్లె మండలంలోని 15 గిరిజన తాండాల ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. ఇప్పటికీ వందల కుటుంబాలు ప్రాజెక్టును నమ్ముకుని వ్యవసాయం చేసుకొని జీవనం సాగిస్తున్నారు.

ఆహ్లాదకరమైన వాతావరణం

ఆహ్లాదకరమైన వాతావరణం. ఆకర్షణీయమైన దృశ్యాలతో సందర్శకులను ఇట్టే ఆకట్టుకునే ప్రాంతాల్లో ఉమ్మడి జిల్లాలోని పింఛా ప్రాజెక్టు ఒకటి. సందర్శకులకు ఇక్కడ సరైన సౌకర్యాలు లేకపోవడం, ఉన్న వాటి గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో రోజురోజుకు సందర్శకుల సంఖ్య తగ్గిపోతోంది. ప్రాజెక్టు దిగువ భాగంలో ఏర్పాటు చేసిన పార్కు నివర్ తుఫాను కారణంగా పెద్ద పెద్ద వృక్షాలు, కట్టడాలు కొట్టుకుపోయాయి.ప్రాజెక్టుకు సమీపంలో ఉన్న అతిథి గృహాలను ఎవ్వరూ పట్టించుకోకపోవడం వలన శిథిలమై పిచ్చిమొక్కలతో నిండి ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకపోవడంతో ఈ ప్రాంతం అధ్వానంగా మారింది. జిల్లా అధికారులు, పర్యాటకశాఖ వారు పింఛా సోయగాలపై దృష్టి పెట్టి వాటిని అభివృద్ధి చేస్తే పింఛా పర్యాటకులను ఆకర్షించగలరని స్థానికులు కోరుతున్నారు.

మంచి రోజులు వచ్చాయి



ప్రాజెక్టు దిగువ భాగంలో ఉండే రైతులకు మంచి రోజులు వచ్చాయి. నాలుగు సంవత్సరాల తర్వాత ప్రాజెక్టు నిండింది. ఈ కారు ప్రతి రైతు పంటలు పండించుకోవచ్చు. సకాలంలో గేటు మరమ్మతులు చేసి నీరు నిల్వ చేయడం సంతోషదాయకం.

- వెంకటరమణ నాయుడు, రైతు, నగిరి

ప్రాజెక్టు పూర్తిగా నిండింది

ప్రాజెక్టు నీటి సామర్థ్యంతో నిండింది. ఈ ఏడాది రైతులకు సాగునీటి సమస్య ఉండదు. రైతులు నీరు వృథా కాకుండా వినియోగించుకోవాలి. ప్రాజెక్టుకు నూతనంగా మరవ ఏర్పాటు చేశాము. దాదాపు పనులు పూర్తి అయిపోయాయి.

- నాగేంద్రనాయక్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

ప్రభుత్వ భూమి కబ్జా యత్నం


స్థానికులతో మాట్లాడుతున్న తహసీల్దారు

నందలూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) మండలంలోని నల్ల తిమ్మయ్యగారిపల్లె గ్రామం సర్వే నంబరు 293లో రెండెకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు బుధవారం కొంతమంది ప్రయత్నించారు. హైకోర్టు ఆర్డరు ఉందంటూ ఎక్స్‌కవేటర్‌తో ప్రభుత్వ భూముల్లో చెట్లను తొలగించడం మొదలుపెట్టారు. అడ్డుకున్న వీఆర్ఏలను బెదిరించారు. సమాచారం అందుకున్న తహసీల్దారు అమర్‌నాథ్ సంఘటనా స్థలానికి చేరుకోవడంతో కబ్జాదారులు పరారయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎటువంటి ఆధారాలు లేకుండా ప్రభుత్వ భూములను ఆక్రమించడానికి ప్రయత్నిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమినే చదును చేశారు...


కబ్జా చేసేందుకు చదును చేసిన ప్రభుత్వ భూమి

సిద్దవటం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దపల్లి రెవెన్యూ ఉప్పరపల్లె గ్రామానికి చెందిన సర్వేనంబరు 1114 లోని 5.09 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు చదును చేస్తున్నా అధికారులు అటువైపు చూడడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత దృష్టికి తీసుకెళ్లగా ఆ ప్రదేశానికి తమ సిబ్బందిని పంపించామని, భూమి చదును చేసిన వారు తమ దగ్గరున్న పత్రాలను తహసీల్దారు కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించామన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో దోపిడీని అరికట్టండి

మదనపల్లె ప్రభుత్వాస్పత్రి ఎదుట సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకుల నిరసన


జిల్లాప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిరసన తెలియచేస్తున్న సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలపై జరుగుతున్న దోపిడీని అరికట్టాలని సీపీఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రి ఎదుట వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మదనపల్లె కార్యదర్శి మురళి మాట్లాడుతూ ఆస్పత్రి డాక్టర్లు ప్రైవేట్‌గా స్కానింగ్, ఎంఆర్ఐ స్కానింగ్, ఎక్స్‌రేలు ఏర్పాటు చేసుకొని రోగులకు అవసరం లేకున్నా వారి సెంటర్లలో తీయిస్తూ సొమ్ము చేసుకొంటున్నారని ఆరోపించారు. జిల్లా ఆస్పత్రిలో డాక్టర్ల కొరత కారణంగా అప్రెంటీస్ డాక్టర్లే అత్యవసర విభాగాల్లో ఉండడం, అవసరమైన పరికరాలు అందుబాటులో లేని కారణంగా చిన్న చికిత్సకు బయటకు రెఫర్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంగా మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గాయత్రికి జిల్లా వినియోగదారుల ఫోరం డైరెక్టర్ రేగడి ప్రసాద్‌కుమార్, ఐటీయూసీ మదనపల్లె డివిజన్ కన్వీనర్ కృష్ణమూర్తి, ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి ఉత్తన్న వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా వినియోగదారుల ఫోరం డైరెక్టర్ రేగడిప్రసాద్ మాట్లాడారు. అలాగే జేసీకి, జిల్లా కలెక్టర్‌కు, డీఎం అండ్ హెచ్‌వోకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ నాయకుడు మాధవ, గంగరాజు, సుబ్రహ్మణ్యం, హేమంత్‌కుమార్, జశ్వంత్, నాగేంద్ర, వరప్రసాద్, గణేష్, మురళి, తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు పర్యాటకంపై జాతీయ సదస్సు

పీలేరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో గురు, శుక్రవారాల్లో పర్యావరణ పర్యాటకంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.సుధాకర్ రెడ్డి తెలిపారు. 'పర్యావరణ పర్యాటకం(ఎకో టూరిజం)-సుస్థిరాభివృద్ధి' అనే అంశంపై భారతీయ సామాజిక శాస్త్రాల పరిశోధనా మండలి(ఐసీఎస్ఎస్ఆర్) ఆర్థిక సహకారంతో ఈ సెమినార్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ రీజనల్ డైరెక్టర్ డా.రమణ ప్రసాద్ రావుల ముఖ్యఅతిథిగా పాల్గొనే ఈ సదస్సులో పాండిచ్చేరిలోని కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు ఆచార్య వై.వెంకటరావు కీలక ఉపన్యాసం ఇస్తారన్నారు. ఈ సదస్సుకు దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు హాజరై పర్యావరణ పర్యాటక రంగంలోని ధోరణులు, అవకాశాలు, సవాళ్లపై చర్చిస్తారని ఆయన తెలిపారు. ఔత్సాహికులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సేంద్రియ ఎరువుగా వర్మీకంపోస్ట్


వర్మీకంపోస్టు తయారీ గురించి రైతులకు వివరిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కలికిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సేంద్రీయ ఎరువుగా వర్మీకంపోస్టును రైతులు ఎవరంతకు వారే తయారు చేసుకోవడం సుళువైన పనేనని పలువురు శాస్త్రవేత్తలు సూచించారు. గ్రామాల్లో పాడి ఆవుల పోషణ విస్తృతంగా వున్నందున ఆవు పేడ తగినంతగా లభిస్తుందని, దీంతో వర్మీకంపోస్టను తయారు చేసి పంట పొలాల్లో వినియోగిస్తే భూసారం పెరగడంతోపాటు పంటలకు రోగ నిరోధక శక్తి కూడా సమకూరుతందని చెప్పారు. గత వారం రోజులుగా స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో వర్మీకంపోస్టు తయారీ గురించి జరుగుతున్న శిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం శిక్షణలో పాల్గొన్న వారికి పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ యువ రైతుల కోసం నిర్వహించిన శిక్షణలో అనేక ప్రయోజనాలతో వర్మీకంపోస్టు తయారీ గురించి క్షుణ్ణంగా అవగాహన కల్పించడం జరిగిందని శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీకే కోఆర్డినేటర్ మంజుల, వీఏఎస్ డాక్టర్ సి.హెచ్. గిరనాథ్, కేవీకే శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

వివాదరహితంగా తీర్చిదిద్దడమే ధ్యేయం


రెవెన్యూ సదస్సును నిర్వహిస్తున్న జిల్లా సర్వేయర్ భరత్‌కుమార్, తదితరులు

కురబలకోట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రామాలను వివాదరహితంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా సర్వేయర్ భరత్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని చింతమాకుపల్లెలో గ్రామరెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా గ్రామాల్లో నెలకొన్న వివిధ రకాల భూ సమస్యలతో పాటుగా వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చామని, వీటిని వీలైనంత త్వరగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల సమస్యలపై 35 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, తహసీల్దార్ తపస్విని, డీటీ శాంతమ్మ, ఆర్ఐ బాలసుబ్రమణ్యం, సర్వేయర్ భువనేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి



సంఘటనా స్థలంలో మృతి చెందిన రైతు సూర్యనారాయణ (ఫైల్)

ములకలచెరువు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని బొలెరో లగేజీ వాహనం ఢీకొనడంతో ఓ రైతు దుర్మరణం చెందిన సంఘటన ముంబై-చెన్నై జాతీయ రహదారిలోని పెద్దపాళ్యం వంతెన వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని పెద్దపాళ్యం పంచాయతీ గొల్లపల్లెకు చెందిన కొండా సూర్యనారాయణ (55) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య శాంతమ్మ, కుమారుడు రంజిత్‌కుమార్, కుమార్తె రజనీ ఉన్నారు. కాగా మదనపల్లెలో ప్రైవేటుగా ఉద్యోగం చేస్తున్న తన కుమారుడికి బస్సులో కూరగాయలు పంపేందుకు ఆ రైతు ద్విచక్ర వాహనంలో కదిరినాథునికోట బస్టాప్ వద్దకు బయలుదేరాడు. ఈ క్రమంలో జాతీయ రహదారి దాటి రోడ్డు పక్కకు వెళ్తున్న సమయంలో వేగంగా వచ్చిన బొలెరో వాహనం ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రైతు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ నరసింహుడు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైతు మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

మా షాపులో కొంటే.. కేసులుండవు..

- బెల్టు షాపుల నిర్వాహకులకు మద్యం దుకాణ యజమానుల భరోసా
- గ్రామాల్లో బెల్టుషాపుల జోరు



గుర్రంకొండ జీవన్‌తోపు రోడ్డు మార్గంలో నిర్వహిస్తున్న మద్యం దుకాణాలు

గుర్రంకొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ పట్టణం, గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. మద్యానికి పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా మద్యం వ్యాపారం జోరుగా సాగుతోంది. దీంతో మద్యం దుకాణదారులు ఇష్టానుసారంగా మద్యాన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ప్రతి పంచాయితీ పరిధిలో జనాభా ఉన్న ప్రతి గ్రామంలో రెండు నుంచి మూడు బెల్టు షాపులను అనధికారికంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం బెల్టు షాపులను నిర్వహిస్తే బెల్టు తీస్తామంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నా గ్రామస్థాయిలో అమలు కావడం లేదన్న ఆరోపణలున్నాయి. అంతేకాకుండా మద్యం దుకాణదారులు తమదంటే తమ దుకాణంలో మద్యం తీసుకెళ్లాలంటూ బెల్టు షాపుల నిర్వాహకులకు పోటీ పడి మరీ మద్యం ఇస్తున్నారు. తమ దుకాణంలో మద్యం తీసుకొంటే ఎక్సైజ్, పోలీసులు పట్టుకుంటే మేమే అండగా ఉంటూ కేసులు లేకుండా చూస్తామని దుకాణదారులు బెల్టుషాపు నిర్వాహకుల్లో ధైర్యాన్ని నింపుతున్నారు. దీంతో బెల్టు షాపు నిర్వాహకులు మద్యం దుకాణదారుల మధ్య పోటీని గమనించి వారం ఓ షాపులో, రెండవ వారం మరో షాపులో మద్యాన్ని తీసుకెళుతున్నారు. అంతేకాకుండా బెల్టు షాపుల నిర్వాహకులకు మద్యం అప్పుగా ఇవ్వడం కొసమెరుపు. ఈ క్రమంలో ఊరురా మద్యం అమ్మకాల కోసం బెల్టుషాపులు విచ్చలవిడిగా వెలిశాయి. అంతేకాకుండా ప్రభుత్వం పర్మిట్‌రూములకు పర్మిషన్ ఇవ్వకపోయినా అనధికారికంగా మద్యం దుకాణాల పక్కనే రూములు ఏర్పాటు చేసుకుని అక్కడే మద్యం తాపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

గుర్రంకొండ మండలంలో 15 పంచాయతీల్లో సుమారు 33వేల మంది ఓటర్లు ఉన్నారు. జనాభా ప్రాతిపదికన మండలానికి ప్రభుత్వం మూడు మద్యం దుకాణాలను మంజూరు చేసింది. ఇందులో రెండు మద్యం షాపులను మండలానికి చెందిన వారు దక్కించుకున్నారు. ఒక షాపును మదనపల్లెకు చెందిన వ్యక్తి దక్కించుకున్నాడు. ఈ నేపథ్యంలో గుర్రంకొండ పట్టణం జీవన్‌తోపు రోడ్డు మార్గంలో రెండు మద్యం షాపులను ఏర్పాటు చేశారు. అలాగే మదనపల్లెకు చెందిన వ్యక్తి మూడవ షాపును తరిగొండ గ్రామంలోని రామాపురం రోడ్డులో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మద్యం అమ్మకాలను పెంచుకోవడానికి నిర్వాహకులు ఇష్టానుసారంగా బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

విద్యార్థులు, మహిళలకు కష్టాలు..

గుర్రంకొండ జీవన్‌తోపు రోడ్డు మార్గంలో రెండు మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో ప్రైవేట్ డిగ్రీ కాలేజీ ఉంది. ఈ కాలేజీకి వందలాది మంది విద్యార్థులు ప్రతిరోజు వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో ఉదయం, మధ్యాహ్నం, సాయంకాలం పూట విద్యార్థులు ఈ మార్గంలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లను ఉంచడంతో రద్దీగా ఉంటూ మద్యం ప్రియులతో గందరగోళంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో విద్యార్థినులు కాలేజీకి పోయి రావాలంటే ఇబ్బందిగా ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

కేసు నమోదు చేస్తాం..

గుర్రంకొండ మండలంలోని గ్రామాల్లో బెల్టుషాపులను నిర్వహిస్తే వారిపై కేసు నమోదు చేస్తాం. అలాగే మద్యం దుకాణాల వద్ద కానీ, పక్కన కానీ కూర్చుని తాగడానికి అనుమతి లేదు. దుకాణాల వద్ద మద్యం తాగుతున్నట్లైతే వాటిని తొలగిస్తాం. గ్రామాల్లో తిరిగి బెల్టుషాపులు లేకుండా రూపుమాపుతాం.

- లత, ఎక్సైజ్ సీఐ, వాల్మీకిపురం సర్కిల్

రేయింబవళ్లు కష్టపడి పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది దిగుబడి బాగుంటే ధర ఉండదని.. ధర ఉంటే దిగుబడి ఉండదని వాపోతున్నారు. ఇలా అయితే వ్యవసాయం చేయడం కష్టమని.. ఏ పంటా సాగు చేయలేమని.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంట ఉత్పత్తులకు సరైన గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



రాశిగా పోసిన వరి ధాన్యం

దిగుబడి బాగుంది... ధర పడిపోయింది

- గత ఏడాది పుట్టి ధాన్యం రూ.16 వేలు
- ఈ ఏడాది రూ.10 వేలకు పడిపోయిన ధర
- ప్రైవేటు వ్యాపారస్థుల దోపిడీ
- ఆవేదనలో రైతన్నలు.. ● పట్టించుకోని ప్రభుత్వాలు

చాపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మండలంలో కేసీ కెనాల్, చాపాడు చానెల్ కింద ఖరీఫ్ సీజన్‌లో సుమారు 26 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి పంట కోత దశకు చేరుకుంది. జగిత్యాల, బీపీటీ 5204, సన్నాలు, జిలకర వంటి రకాలను సాగు చేశారు. రైతులు వరి కోత మిషన్ల ద్వారా కోతలు కోస్తున్నారు. ఎకరాకు 30 నుంచి 40 బస్తాల వరకు దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. కడప, చెన్నై, బెంగుళూరుకు చెందిన వ్యాపారులు పుట్టి (8 బస్తాలు) రూ.10,500 నుంచి రూ.11,300 వరకు ధర పెట్టి వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది పుట్టి వరి ధాన్యం రూ.16 వేలు ధర పలకగా.. ఇప్పుడు దాదాపు రూ.5 వేలు ధర తక్కువగా ఉందని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి బాగుందని సంతోషపడితే.. ధర ఒక్కసారిగా పడిపోవడంతో తమ ఆశలు అడియాశలయ్యాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒక ఎకరా సాగుకు సుమారు 30 వేలు ఖర్చు అయ్యిందని.. ప్రభుత్వం వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవంతో వ్యాపారస్థులు ఇష్టానుసారంగా అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని వాపోతున్నారు. లక్ష్మీపేట, సోమాపురం, కేతవరం, చాపాడు, చియ్యపాడు, విశ్వనాథపురం, భద్రిపల్లె తదితర గ్రామాల వద్ద కోతలు కోస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షం వస్తుందేమోనని భయంతో రైతులు వరి ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. ఇళ్లలో నిలువ చేసుకునేందుకు స్థలం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా మద్దతు ధర పెంచి, పుట్టి రూ.16 వేలకు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.



సంచుల్లో నింపిన వరి ధాన్యం



కోత దశకు చేరుకున్న వరి పైరు

పుట్టి రూ.16 వేలకు కొనుగోలు చేయాలి



గత ఏడాది పుట్టి (8 బస్తాలు)ధాన్యం ధర రూ.16వేలు పలికితే... ఇప్పుడు ప్రైవేటు వ్యాపారస్థులు రూ.10,500లకు కొనుగోలు చేస్తున్నారు. ఎకరా వరి సాగు చేసినందుకు రూ.30వేలు ఖర్చు అయ్యింది. నాలుగు నెలలపాటు కష్టపడితే రూ.10వేలు మిగులుతున్నాయి. ఇలా అయితే ఎలా వ్యవసాయం చేసేది. ప్రభుత్వం పుట్టి రూ.16 వేలకు కొనుగోలు చేయాలి.

- శ్రీనివాసులు, రైతు, కేతవరం గ్రామం

వ్యాపారస్థులు చెప్పిందే ధర



వరి ధాన్యం కొనుగోలులో ప్రైవేటు వ్యాపారస్థులు చెప్పిందే ధర.వాళ్లు చెప్పిన రేటుకే అమ్ముకోవాల్సి వస్తోంది. పుట్టి రకాన్ని బట్టి రూ.10,500 నుంచి రూ.11,300లకు కొనుగోలు చేస్తున్నారు. దిగుబడి బాగుందిలే అనుకుంటే ధర ఒక్కసారిగా తగ్గించారు. నిల్వ చేసుకుందామనుకుంటే వాన భయం పట్టుకుంది. ప్రభుత్వం రూ.16 వేలకు కొనుగోలు చేయాలి.

- దస్తగిరి, రైతు, కేతవరం గ్రామం

నైపుణ్యాలు పెంపొందించేందుకు ఇంటర్న్‌షిప్, నైపుణ్యాభివృద్ధి కోర్సులు



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వైవీయూ, హైదరాబాద్ సంస్థల ప్రతినిధులు

కడప, ఎడ్యుకేషన్ డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించేందుకు ఇంటర్న్‌షిప్, నైపుణ్యాభివృద్ధి కోర్సులు ప్రవేశ పెడుతున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం వైవీయూ వీసీ చాంబర్‌లో హైదరాబాద్ స్కిల్ డిజైర్ టెక్నాలజీస్ ప్రైవేట్ సంస్థతో వైవీయూ ఒప్పందం కుదుర్చుకుంది. వీసీ సమక్షంలో రిజిస్ట్రార్ పద్మ, స్కిల్ డిజైర్ సంస్థ సంచాలకులు శ్రీకాంత్ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈసందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంఓయూ ద్వారా నైపుణ్యాభివృద్ధి కోర్సులు, ఇంటర్న్‌షిప్‌లు నిర్వహిస్తామన్నారు. మద్రాస్ ఐఐటీ మోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందన్నారు. వైవీయూ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ అనుబంధ కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అభివృద్ధి చేయడం ఈ ఒప్పంద ప్రధాన ఉద్దేశ్యమని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రఘునాథరెడ్డి, యూనివర్సిటీ డీన్ కేజీ దాము, గంగయ్య, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ రెడ్డయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు ఎలాంటి సమస్య లేదు : డీఎంహెచ్‌ఓ



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీని సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

వేంపల్లె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు ఎలాంటి సమస్య లేదని, తల్లిదండ్రులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు తెలిపారు. కొద్దిరోజులుగా ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారని పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆరాటీసి ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీని బుధవారం సందర్శించింది. డీఎంహెచ్‌ఓ నాగరాజు, పులివెందుల ఇన్‌చార్జి ఆర్డీవో చిన్నయ్య, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి హరిత మొదట ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ ఇతర అధికారులతో సమావేశమై చర్చించారు. ట్రిపుల్‌ఐటీలో చదువుతున్న విద్యార్థులు, ఒంగోలు క్యాంపస్ విద్యార్థులతో మాట్లాడారు. ఆస్పత్రిని సందర్శించి స్థానిక వైద్యులతో మాట్లాడారు. మెస్, నీటి సరఫరా ప్రాంతాలను పరిశీలించారు. ఫుడ్ పాయిజన్ ఎవరికీ కాలేదని నిర్ధారించుకున్నారు. పాత క్యాంపస్‌లో ఉన్న ఒంగోలు ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు ఇక్కడి మసాలాలు పడకపోవడం వల్ల కొందరికి వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి వచ్చాయని, మిగిలిన విద్యార్థులకు ఎలాంటి సమస్య లేదని డైరెక్టర్, వైద్యులు ఉన్నతాధికారులకు వివరించారు. మెస్‌లోని ఆహారపదార్థాలు, తాగునీటి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. కాగా ఒంగోలు క్యాంపస్‌లో మసాలాలు తగ్గించాలని, క్యాంటీన్లను ఏర్పాటు చేస్తే బయటి ఫుడ్‌కు వెళ్లాల్సిన అవసరం ఉండదని అధికారులకు విద్యార్థులు విన్నవించారు. కలెక్టర్‌ను కలిసి క్యాంటీన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ తెలిపారు.

కలిచెర్లలో పర్యటించిన డీఎస్పీ

పెద్దమండ్యం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిచెర్ల గ్రామంలో మదనపల్లి డీఎస్పీ కొండయ్యనాయుడు, తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఎస్‌ఐ రమణ లు బుధవారం పర్యటించారు. కలిచెర్ల సమీపంలో ఓ దర్గా వద్ద ఉరుసు నిర్వహణకు ఓ వర్గం వారు జిల్లా ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. మరో వర్గం వారు విభేదించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల శాఖాధికారులు పీస్ కమిటీ ఏర్పాటు చేసి వారి అభిప్రాయాలను సేకరించారు. దర్గా ప్రాంతాన్ని పరిశీలించారు. గ్రామ ప్రజలతో మాట్లాడారు. వీరి వెంట పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వినోద్‌కుమార్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

మైదుకూరు రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యనభ్యసించి... ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన పలువురిని కలచివేసింది. మైదుకూరు మండలం జీవిసత్రం పరిధి లక్ష్మీనారాయణ పురం గ్రామానికి చెందిన వెంకట రమణారెడ్డికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు వినోద్‌కుమార్ రెడ్డి (22) బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నంలో ఉన్నాడు. బుధవారం తెల్ల వారుజామున సొంత పని నిమిత్తం మైదుకూరు వెళుతున్న తన తండ్రిని వదిలిపెట్టేందుకు బైక్‌పై బయలుదేరాడు. గడ్డంవారిపల్లె వద్దకు వెళ్లగానే వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొంది. దీంతో వినోద్‌కుమార్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, వెంకట రమణారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఏఎస్‌ఐ మురళీయాదవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి మృతి



సికెదిన్నె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఉరి వేసుకుని యూసఫ్‌బాష(37) అనే వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని ఎఎల్‌కాలనీలో గత కొంత కాలంగా యూసఫ్‌బాష ఒంటరిగా ఉంటున్నాడు. కడప నగరానికి చెందిన ఇతను భార్య, పిల్లలతో విడిపోయి... డ్రైవర్‌గా పనిచేస్తూ ఇక్కడ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఓనర్ వద్ద బైక్ తీసుకుని వచ్చి ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

సికెదిన్నె, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటు కూరు రింగు రోడ్డు సమీపంలో బుధవారం రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఏరువాక కేంద్రంలో పనిచేసే పూర్ణచంద్ర, మరో వ్యక్తి బైక్‌లు అదుపు తప్పి ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ప్రైవేటు వాహనాల్లో రిమ్స్‌కు తరలించగా.. మెరుగైన చికిత్స కోసం పూర్ణచంద్రను తిరుపతికి తరలించినట్లు తెలిసింది. మరో వ్యక్తి సమాచారం తెలియాల్సి ఉందని, ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సికెదిన్నె పోలీసులు తెలిపారు.

దాడి కేసులో నలుగురు అరెస్టు

కడప(క్రైం), డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో గత నెల 16న జరిగిన దాడి కేసుకు సంబంధించి నలుగురిని అరెస్టు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. గత నెల 16వ తేది రాత్రి చిలకలబావి వద్ద అరబత్‌ను ఇలియాస్, సలీమ్, బన్నీ, తాజ్‌లు దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

పోరుమామిళ్ల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లకు చెందిన కట్టమూరి శిరీష్ అనే వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. పోరుమామిళ్ల మండలంలోని రామిరెడ్డిగుంటకు చెందిన నాగిరెడ్డి శంకర్‌రెడ్డి అనే వ్యక్తి దగ్గర నుంచి కట్టమూరి శిరీష్ 2022 సంవత్సరంలో రూ.45 లక్షలకు సంబంధించి 90 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి అడ్వాన్స్‌గా రూ.20 లక్షలు ఇచ్చాడు. మిగిలిన రూ.25 లక్షలు ఇవ్వకుండా ఇబ్బంది కలుగజేస్తున్నాడని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తల్లి హత్య కేసులో తనయుడి అరెస్టు

పెద్దమండ్యం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): తల్లి హత్య కేసులో తనయుడి (ఓబులేసు)ని అరెస్టు చేసినట్లు ములకలచెరువు సీఐ లక్ష్మన్న వెల్లడించారు. సీఐ వివరాల మేరకు.. పెద్దమండ్యం మండలం సి.గొల్లపల్లి గ్రామంలో బోడెం ఓబులేసు మద్యానికి బానిసై తల్లి ఓబులమ్మ(60)ను డబ్బుల కోసం వేధించేవాడు. ఈ క్రమంలో ఆమె డబ్బులు ఇవ్వలేదని కోపంతో కర్రతో దాడి చేశాడు. తలకు, కాళ్లకు క్రూరంగా కొట్టడంతో రక్తపుమడుగులో పడిపోయింది. గ్రామస్థులు గుర్తించి పెద్దమండ్యం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఓబులమ్మకు చికిత్స నిమిత్తం 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తిరిగి ఇంటికొచ్చిన రెండు రోజుల తరవాత ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. కాగా నవంబరు 24న వృద్ధురాలు ఓబులమ్మ బంధువుల ఫిర్యాదు మేరకు పెద్దమండ్యం ఎస్‌ఐ వీవీ రమణ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు దర్యాప్తు ములకలచెరువు సీఐ లక్ష్మన్న ఆధ్వర్యంలో వేగవంతం చేశారు. నిందితుడి కోసం పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో బుధవారం నిందింతుడు ఓబులేసును పెద్దమండ్యం బస్టాప్ వద్ద అరెస్టు చేసి కోర్టుకు తరలించగా రిమాండ్‌కు ఆదేశించించినట్లు సీఐ తెలిపారు.

ఉద్యోగ, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామలింగారెడ్డి

కడప మారుతీనగర్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలుపుదల చేసి ఆయా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. విద్యుత్‌రంగం ప్రైవేటీకరణ, ఉద్యోగుల సమస్యలపై ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆద్వర్యంలో బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సదస్సు జరిగింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామలింగారెడ్డి, శివయ్య, బాలకాశి మాట్లాడారు. విద్యుత్ రంగం ప్రైవేటీకరణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెనుమార్పులకు శ్రీకారం చుడుతున్నాయన్నారు. ఈ రంగాన్ని పూర్తిగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు వేగంగా పావులు కదుపుతున్నతీరు సరికాదన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ముందుగా ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార సంస్థలకు ప్రీపెయిడ్ మీటర్లు తీసుకువచ్చారన్నారు. అదే తరహాలో గృహాలకు కూడా తీసుకురానున్నారని వెల్లడించారు. నిత్యావరమైన విద్యుత్‌ను ప్రైవేటు వారికి ధారాదత్తం చేస్తే ప్రజలతో పాటు దేశ భద్రత కూడా ప్రమాదంలో పడుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, యూనియన్ డిస్కం కార్యదర్శి సురేష్, జిల్లా నాయకులు నాగిరెడ్డి, సురేష్, హరికేశవరెడ్డి, కేశవ, దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.

పెండ్లూరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

వేముల, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెండ్లూరు గ్రామంలో మంగళవారం ఆ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ సుదర్శన్‌రెడ్డిపై అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరత్నమ్మ విచారణ చేపట్టారు. ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌పై పెద్దఎత్తున అవినీతి చేసినట్లు ఆధారాలతో ఆ గ్రామ నాయకులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు విచారణ చేపట్టేందుకు మంగళవారం గ్రామానికి వచ్చిన అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరత్నమ్మ విచారణలో ఫిర్యాదుదారులపైనే శివాలెత్తడంతో వారు ఆశ్చర్యం వ్యక్తం చేశా రు. విచారణలో ఆధారం చూపుతుంటే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉపాధి హామీ పథకంలో పనిచేయకూడదనే నిబంధన ఉన్నప్పటికీ పనిచేసినట్లు ఎఫ్‌ఏ నమోదు చేశాడని చెప్పగా.. విచారణ అధికారి నాగరత్నమ్మ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కేవలం రూ.5వేలు, రూ.6వేలు డబ్బులు జీతం వస్తుందని అటువంటి వారు పనిచేయకూడదా అంటూ ఫిర్యాదుదారులపైనే ఎదురు ప్రశ్నించారు. అలాగే పలు ఆధారాలను ఆమె ముందు ఉంచగా నేనేమైనా లైట్లు వేసుకొని చూడాలా మీరే ఇవ్వండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తేలిసింది. అలాగే ప్రభుత్వం మారిన వెంటనే ఎఫ్‌ఏను ఎందుకు తొలగించాలని ఫిర్యాదుదారులనే ఎదురు ప్రశ్నించడంతో ఇదెక్కడి న్యాయమంటూ ఫిర్యాదు దారులు ఆగ్రహంతో విచారణ నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం ఫిర్యా దుదారులైన అవేంద్రరెడ్డి, చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ మేము పూర్తి స్థాయిలో ఆధారాలతో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన ఆధారాలు అన్నింటిని ఉపాధి హామీ అధికారులు ముందుగానే ఆ ఎఫ్‌ఏ సుదర్శన్‌రెడ్డికి పంపించడం జరిగిందని.. అలాగే విచారణకు వచ్చిన ఏపీడీ పూర్తి స్థాయిలో వన్‌సైడ్‌గా విచారణ చేస్తోందని తెలిపారు. ఏపీడీ నాగరత్నమ్మను తప్పించి మరో విచారణ అధికారిని నియమించి పూర్తిస్థాయిలో విచారణ చేయాలని వారు జిల్లా అధికారులను కోరారు.

ఈడబ్ల్యూఎస్ శాఖలోకి ఆరు కార్పొరేషన్లు

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన శాఖ (ఈడబ్ల్యూఎస్) పరిధిలోకి ఆరు కార్పొరేషన్లను తీసుకొస్తూ బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ రెడ్డి సంక్షేమ కార్పొరేషన్, కమ్మ సంక్షేమ కార్పొరేషన్, బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్, క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్, ఆర్యవైశ్య కార్పొరేషన్, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్పొరేషన్లను పాలనకు అనుకూలంగా ఈడబ్ల్యూఎస్ శాఖ పరిధిలోకి తీసుకొచ్చారు.

డీఎస్సీ పరీక్షలకు ఆన్‌లైన్ శిక్షణ

- ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్

అమరావతి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వివిధ పాఠశాలల్లో ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించనుంది. ఈ డీఎస్సీ పరీక్షల కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ విద్యార్థులకు 26 జిల్లాల్లో బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా కోచింగ్ ఇస్తున్నారు. ఇప్పుడు అదనంగా ఆన్‌లైన్ విధానంలో కూడా శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సంకల్పించింది. ఈమేరకు ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వగలిగిన కోచింగ్ సంస్థల నుంచి టెండర్లు కూడా పిలిచారు. ఈ నెల 12 నుంచి 20వ తేదీ లోపు ఆన్‌లైన్ విధానంలో టెండర్ వేయాలని ఏపీ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మాతృభాష పరిరక్షణ అందరి కర్తవ్యం

కడప, ఎడ్యుకేషన్ డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాతృభాష పరిరక్షణ అందరి కర్తవ్యమని ఆంధ్రాయూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ ఆదినారాయణ తెలిపారు. బుధవారం వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూని వర్సిటీలో భారతీయ ఉత్సవ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు భాష ప్రాధాన్యతను తెలియజేశారు. అనంతరం డాక్టర్ శివరామ సురేంద్రశర్మ మాట్లాడుతూ అవగాహన ప్రక్రియ తెలుగుభాషకు మాత్రమే ప్రత్యేకవరమని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ డాక్టర్ వై.వర లక్ష్మి, డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, ఉదయ్‌ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

పులివెందులలో డమ్మీ తుపాకీతో హల్‌చల్

- బాకీ డబ్బులు అడిగినందుకు వ్యక్తిపై దాడి



గాయపడిన నాగిరెడ్డి

పులివెందుల టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బాకీ డబ్బులు అడిగినందుకు డమ్మీ తుపాకీతో ఓ వ్యక్తి తలపై కొట్టి గాయపరిచిన సంఘటన పులివెందులలో చోటుచేసుకుంది. బుధవారం పట్టణంలోని లయోల డిగ్రీ కళాశాల సమీపంలో క్లబ్ దగ్గర అర్.తుమ్మలపల్లె గ్రామానికి చెందిన నాగిరెడ్డి తనకు బాకీ ఉన్న డబ్బులు ఇవ్వాలని శివప్రసాద్‌ను అడగడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. శివప్రసాద్ తన మిత్రుడు చక్రధర్‌రెడ్డి అలియాస్ బబ్లూకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. దీంతో బబ్లూ అక్కడకు వచ్చి నాటు తుపాకీతో నాగిరెడ్డి తలపై కొట్టి తీవ్రంగా గాయ పరిచాడు. బాధితుని స్థానికులు వైద్యం కోసం పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తర లించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, పులివెందులలో జరిగిన సంఘటనపై నాటు తుపాకీ హల్‌చల్ అని సోషల్ మీడియాలో రావడంపై సీఐ స్పందించారు. అది డమ్మీ బొమ్మ తుఫాకీ అని తెలిపారు. ఈ సంఘటనకు కారకులైన శివప్రసాద్, చక్రధర్‌రెడ్డి అలియాస్ బబ్లూలపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తాగునీటికి పరీక్షలు నిర్వహించాలి


మున్సిపల్ అధికారుల సమీక్షలో సూచనలిస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లెటౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలోని కలరింగ్ యూనిట్లు వుండే ప్రాంతాల్లో గల బోర్లలో తాగునీటిని సేకరించి వాటిని పరీక్షించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలరింగ్ యూనిట్ల నుంచి వచ్చే నీరు భూమిలో ఇంకితే, అవి తాగునీటిలో కలిసి విషతుల్యమయ్యే అవకాశం వుందని, ప్రతి మూడు నెలలకు ఒకసారి ఈ బోర్లలో నీటిని పరీక్షించాలన్నారు. పట్టణంలో వీధి దీపాలకు ప్రతి నెలా రూ.లక్షల్లో విద్యుత్‌చార్జీలు చెల్లిస్తున్నారని, వీటి స్థానంలో సోలార్ విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేస్తే ఏడాదికి మున్సిపాలిటికి రూ.కోటి దాకా ఖర్చు తగ్గుతుందన్నారు. పట్టణంలో పలుచోట్ల పారిశుధ్యం సక్రమంగా లేనట్లు తనకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, కౌన్సిలర్ నాగార్జునబాబు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే అధికారులు

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రజల ముంగిటకు అధికారులు వచ్చారని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తట్టివారిపల్లె గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల భూములకు సంబంధించి పాసుపుస్తకాలు, వన్-బీ, అడంగల్, సరిహద్దు సమస్యలు పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు కృషి చేయాలన్నారు. కొందరు రాజకీయ నాయకులు రైతుల భూములతో చెలగాటం ఆడుతున్నారన్నారు. తట్టివారిపల్లె గ్రామంలో పక్కా, డీకేటీ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, వీటిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి అసలైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దీపా, నోడల్ అధికారి డీఎల్‌డీవో అమరనాథరెడ్డి, తహసీల్దార్ ఖాజాబీ, ఎంపీడీవో తాజ్‌మస్రూర్, ఆర్ఐ శేషాద్రిరావు, వీఆర్‌వో ప్రసాద్, సర్వేయర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రం మండలం మద్దయ్యగారిపల్లెలోని మొలకలచెరువు మెయిన్‌రోడ్డు పక్కనే ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. దీంతో ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'చిత్రం చెప్పిన సమస్య'తో ప్రచురితమవ్వడంతో ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ఆ విద్యుత్ స్తంభం స్థానంలో నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను పిల్లలకు అందకుండా పైకి అమర్చారు. దీంతో విద్యార్థులకు, ప్రజలకు పెద్ద ప్రమాదం తప్పినట్లయింది. కాగా సమస్యను వెలుగులోకి తెచ్చినందుకు మద్దయ్యగారిపల్లె ప్రజలు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆంధ్రజ్యోతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

పాలేటి గంగమ్మకు కుంభాభిషేకం


ప్రత్యేకాలంకరణలో గంగమ్మ

మదనపల్లె అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోళ్లబైలు పంచాయతీ, జగన్ కాలనీలో బుధవారం పాలేటి గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ఆలయకమిటీ సభ్యుల కుంభాభిషేకం నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి హోమాలు, కలశస్థాపన ప్రత్యేకాలంకరణలతో అమ్మవారిని అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో అమ్మవారికి నిర్వహించి విశేషపూజల్లో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పూజాది కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నల్లారిని కలిసిన జకియాఖానం

కలికిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ఎమ్మెల్సీ, ఏపీ లెజిస్లేటివ్ కౌన్సిల్ వైస్ ఛైర్‌పర్సన్ జకియాఖానం బుధవారం పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిని కలిశారు. నగరిపల్లెలోని ఎమ్మెల్యే నివాసంలో ఆమె మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఇరువురూ అరగంటపాటు విడిగా సమావేశమయ్యారు. జిల్లా అభివృద్ధి కోసం పరస్పర సహకారంతో కలిసి పనిచేయాలనే అంశంపై ఇరువురూ చర్చించుకున్నట్లు తెలిసింది. ఇది మర్యాదపూర్వకమైన సమావేశమేనని వెల్లడించారు. జకియాఖానం వెంట ఆమె బంధువు నాసిర్, కలికిరి మండల మైనార్టీ అధ్యక్షుడు మున్వర్ అలీ వున్నారు.

14న అయ్యప్ప గ్రామోత్సవం

మదనపల్లెఅర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పిలి గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో డిసెంబరు 14న శనివారం మదనపల్లె పట్టణంలో అయ్యప్ప స్వామి గ్రామోత్సం నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పురి సుధాకర్‌నాయుడు తెలిపారు. శనివారం ఉదయం అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా రథంలో అలంకరణ చేసి గ్రామోత్సం నిర్వహిస్తామన్నారు. పురవీధుల్లో అయ్యప్పనగర్, సొసైటీకాలనీ, ఎన్టీఆర్ సర్కిల్, బెంగళూరు బస్టాండ్, టౌన్ బ్యాంకు సర్కిల్, సీటీఎం రోడ్డు, బర్మావీధి, సుభాష్‌రోడ్డు, నిమ్మనపల్లె సర్కిల్, చిత్తూరుబస్టాండ్, నెహ్రూబజార్, అప్పారావువీధుల మీదుగా రథోత్సవం సాగుతుందన్నారు, కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు మార్పురి సుధాకర్‌నాయుడు, జర్మన్‌రాజు, విజయలక్ష్మీభాస్కర్, సోమశేఖర్, మహేష్, శివమూర్తి, భగవాన్, ఢంకనాచారి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి నేటి నుంచి ఆయా గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందాలచే గ్రామాల్లో తనిఖీ నిర్వహించనున్నట్లు ఉపాధిహామీ ఏపీవో తిరుపాలప్ప పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ గతేడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు మండలంలోని వివిధ గ్రామాల్లో 1,461 పనులు జరిగాయని, ప్రభుత్వ భవనాలతో పాటు ఈ పనులకు సంబంధించి మొత్తం రూ.9 కోట్ల నిధులతో పనులు చేపట్టామన్నారు. ఈ బహిరంగ సమావేశానికి జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారన్నారు.

నలుగురిపై కేసు నమోదు

గుర్రంకొండ, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వ్యక్తిపై దాడి చేసిన కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీ గెరికుంటపల్లెకు చెందిన శ్రీనివాసుల కుటుంబానికి, వెంకటేష్ కుటుంబానికి భూ సమస్యలున్నాయి. ఈ క్రమంలో మంగళవారం భూమి విషయంలో వెంకటేష్, అరుణ, నాగరాజ, నిర్మలలు కలిసి శ్రీనివాసులపై దాడి చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తాపడి ముగ్గురికి గాయాలు


గాయపడ్డ వృద్ధురాలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తాపడి ముగ్గురు గాయపడిన సంఘటన బుధవారం కురబలకోటలో చోటుచేసుకుంది. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. కురబలకోటకు చెందిన నబీసాహెబ్ భార్య ఫాతిమా(65), మదార్ సాబ్ కుమారుడు మహమ్మద్(45), ఖాసీంసాహెబ్ కుమారుడు మహబూబ్ బాషా(43)లు కురబలకోట నుంచి మదనపల్లెకి ఆస్పత్రికి ఆటోలో బయలుదేరారు. కురబలకోట హైస్కూల్ సమీపానికి ఆటో రాగానే టైర్ పంక్చర్ కావడంతో ఆటో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

'పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం'

రాయచోటిటౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పోలీసు కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని లక్కిరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కొండూరు సతీశ్‌కుమార్‌రాజు సతీమణి అఖిలభారతికి బుధవారం విడో ఫండ్ నుంచి రూ.50 వేలు, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.25 వేలు, ఐడీఆర్‌ఎఫ్ నుంచి రూ.ఒక లక్షతో కలిసి మొత్తం రూ.1.75 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఏవో కృష్ణుడు పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నికకు నోటిఫికేషన్

కలికిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లూరు బయ్యపురెడ్డి చెరువు నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. ఎన్నికల అధికారి, ఎంపీడీవో భానుమూర్తిరావు బుధవారం గ్రామంలో ఎన్నికల షెడ్యూలుకు సంబంధించిన ప్రకటన చేశారు. సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షులను ఎన్నుకునేందుకు 14న శనివారం ఇప్పటికే నమోదైన సభ్యులందరూ స్థానిక పాఠశాలల్లో హాజరు కావాల్సిందిగా తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించి ఏకాభిప్రాయం లేనట్లయితే ఓటింగ్ నిర్వహిస్తామని చెప్పారు. ఆయకట్టు నీటి వినియోగదారులందరూ హాజరు కావలసిందిగా ఎన్నికల అధికారి కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కురబలకోట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఖాళీగా ఉన్న చౌకదుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ తపస్విని పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కురబలకోట పంచాయతీ మద్దిరెడ్డిగారిపల్లె (ఓసీ), ముట్లివారిపల్లె పంచాయతీ యర్రమద్దివారిపల్లె (బీసీ-డి), అంగళ్లు పంచాయతీ మొలకవారిపల్లె (ఓసీ మహిళ), ముదివేడు(బీసీ-బి మహిళ)లకు కేటాయించామన్నారు. అర్హత కలిగిన వారు ఈ నెల 15లోగా పూర్తి చేసి తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

కలకడ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ ఫణికుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఎనుగొండపాలెం పంచాయతీ దిగువపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు అధికారులకు సమస్యలు తెలిపి అర్జీలను అందజేశారు. ఇందులో మొత్తం 22 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ దేవి, వీఆర్వో మహ్మద్ బాషా, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

'మోహన్‌బాబును వెంటనే అరెస్టు చేయాలి'

మదనపల్లె, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులపై దాడి చేసిన మాజీ ఎంపీ, సినీనటుడు మోహన్‌బాబును వెంటనే అరెస్టు చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండపల్లె అక్కులప్ప, జిల్లా కార్యదర్శి ఎస్.వంశీధర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మోహన్‌బాబు కుటుంబ వ్యవహారాల్లో మీడియా జోక్యం చేసుకోలేదని, ఆ వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాకే మీడియా జోక్యం చేసుకుందని వారు పేర్కొన్నారు. విద్యాసంస్థల అధినేతగా, మాజీ రాజ్యసభ సభ్యుడిగా సమాజానికి మార్గదర్శకంగా ఉండాలే కానీ.. వీధిరౌడీలా వ్యవహరించడం సరికాదని సూచించారు. ఈ విషయంలో ఇప్పటికే ఆంధ్ర, తెలంగాణాలో జర్నలిస్టు సంఘాలు నిరసన చేస్తున్నాయని, ఆయనపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

● ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వెలుగు సంఘాల్లో ఉన్న మహిళలు ఎస్‌వీఈపీతో వ్యాపారవేత్తలుగా ఎదగాలని ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన పీటీఎంలోని ఇందిరా క్రాంతి భవనంలో వెలుగు ఏపీఎం హరి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సీఆర్పీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెలుగు కార్యాలయంలో బ్లాక్ రీసోర్స్ సెంటర్ నిర్వహణకు ఏర్పాటు చేసిన సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో తిరుపాలప్పతో పాటు మండల స్థాయి అధికారులు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు గ్రామాల్లో ముమ్మరంగా ఫాగింగ్


కలికిరిలో ఫాగింగ్‌ను పరిశీలిస్తున్న అశోక్, యోగేశ్‌రెడ్డి

కలికిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కలికిరి మేజర్ పంచాయతీలో దోమల నివారణకు అధికారులు సమాయత్తమయ్యారు. పట్టణం, పరిసర గ్రామాల్లోనూ బుధవారం ఫాగింగ్ యంత్రంతో పొగబెట్టి దోమల నిర్మూలనకు శ్రీకారం చుట్టారు. మరోవైపు మురుగు నీరు, ఇతర వ్యర్థ నీరు నిల్వలున్న గుంతలపై ఆయిల్ బాల్స్‌ను వినియోగించి దోమల వ్యాప్తిని అరికట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. బుధవారం యల్లమ్మ ఆలయం పరిసరాలు, నల్లారి కాలనీ, చెరువుముందరపల్లె, మాదిగపల్లె తదితర ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించారు. సర్పంచ్ యల్లయ్య, మేజర్ పంచాయతీ కార్యదర్శి జి.అశోక్, పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డివారి యోగేశ్‌రెడ్డి, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి


ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఏఎస్‌వో రామ్మోహన్

పీలేరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలు ఈ నెల 14న జరగనున్నాయని, నిష్పక్షపాతంగా నిర్వహించాలని తహసీల్దారు భీమేశ్వరరావు ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఎన్నికల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది ఎటువంటి ప్రలోభాలు, ఒత్తిళ్లకు లోనుకాకుండా, వివాదరహితంగా ఎన్నికలు నిర్వహించాలన్నారు. అనంతరం ఏఎస్‌వో రామ్మోహన్ మాట్లాడుతూ ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నిర్దేశించిన నియమాలను సిబ్బందికి వివరించారు. పట్టణంలోని అయ్యప్పనాయుని చెరువు, గూడరేవుపల్లెలోని సూరప్పగారిచెరువు, దొడ్డిపల్లె పంచాయతీలోని చింతలచెరువుకు ఎన్నికలు జరగనున్నట్లు ఆయన తెలిపారు. అయ్యప్పనాయుని చెరువుకు పీలేరు ఎంపీడీవో శివశంకర్, సూరప్పగారిచెరువుకు పీఆర్ ఏఈ రామకృష్ణ నాయక్, చింతల చెరువుకు తహసీల్దారు భీమేశ్వరరావు ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారని వెల్లడించారు.

ఎన్నికల కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, అధికారులు

నిమ్మనపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 14న జరగబోయే సాగునీటి సంఘాల ఎన్నికల కేంద్రాలను బుధవారం తహసీల్దార్ ధనంజేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వున్న అహోబిలనాయునిచెరువు, బాహుదా ప్రాజెక్టు, కోమిటివానిచెరువు, కొండవంక చెరువులకు సంబంధించి ఈ నెల 14న ఎన్నికలు జరుగుతాయన్నారు. దీనికి నిమ్మనపల్లి జడ్పీ హైస్కూల్, తవళంలో ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించి ఎన్నికలకు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆసక్తి గల సాగునీటి రైతులకు 14వ తేది ఉదయం 9గంటలకు నామినేషన్ వుంటుందని, మధ్యాహ్నం ఎన్నికలు జరుగుతాయని 3గంటలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోవడం జరగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ బాబ్జి, సిబ్బంది రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

పెద్దతిప్పసముద్రం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామసభల్లో వచ్చిన భూసమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టి వాటి పరిష్కార మార్గాన్ని అన్వేషిస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ విద్యాసాగర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని టి.సదుం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భాగంగా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి పలు రెవెన్యూ అంశాలపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించాలని నిర్ణయించారు. కాగా బుధవారం ఈ సదస్సులో మొత్తం 43 మంది అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో మొలకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ శారద మునికృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ విద్యాసాగర్, ఆర్ఐ బాలాజీ, మండల సర్వేయర్ శ్రీవాణీ, విఆర్వో అమర నారాయణతో పాటు స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డీకేటీ పట్టాలు మంజూరు చేయండి



సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

తంబళ్లపల్లె, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): డీకేటీ పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ దిగువపాళెం రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. బుధవారం మండలంలోని అన్నగారిపల్లె (దిగువపాళెం)లో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతులు, గ్రామస్తుల నుంచి వివిధ సమస్యలపైన మొత్తం 25 అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు హరికుమార్ తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జోగేంద్ర, సబ్‌రిజిస్ట్రార్ ఉదయ్‌కిరణ్‌రెడ్డి, డీటీ రవీంద్రనాయక్, ఎఫ్‌బీవో రామరాజు, దేవదాయశాఖ రికార్డు అసిస్టెంట్ కొండకిట్ట, సచివాలయ సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి సారూ..!

● రెవెన్యూ సదస్సులో బాధిత రైతుల గగ్గోలు

బి.కొత్తకోట, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తమ పెద్దలు కొనుగోలు చేసిన భూములను ఇతరుల పేరున మార్చేశారు. మాకు న్యాయం చేయండి సారూ... అంటూ పలువురు బాధిత రైతులు రెవెన్యూ అధికారుల వద్ద గగ్గోలు పెట్టారు. బుధవారం బి.కొత్తకోట మండలంలోని బడికాయలపల్లిలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వివిధ భూసమస్యలపై 74 మంది రైతులు అర్జీలు ఇచ్చారు. దాదాపుగా అర్జీలన్నీ వైసీపీ హయాంలో పనిచేసిన రెవెన్యూ అధికారుల తప్పిదాలు, నిర్లక్ష్యాలు, మోసాల మీదనే రావడం గమనార్హం. వీరికి సమాధానాలు చెప్పలేక సిబ్బంది తలలు పట్టుకోవాల్సి వచ్చింది.

రేషన్ డీలర్ల నియామకానికి నోటిఫికేషన్

కలికిరి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో 15 రేషన్ దుకాణాలకు కొత్త డీలర్ల నియామకానికి నోటిఫికేషన్ జారీ అయింది. మండలంలో ప్రస్తుతం 10 దుకాణాలు శాశ్వత డీలర్లు లేక అటాచ్‌మెంట్‌లో నడుస్తున్నాయి. ఇవి కాకుండా మరో ఐదు దుకాణాలు కొత్తగా ఏర్పాటు చేసేందుకు గుర్తించారు. ప్రస్తుతం వున్న దుకాణాల్లో గరిష్ఠంగా కార్డులు వున్న దుకాణాల నుంచి కొన్ని కార్డులను వేరు చేసి ఈ ఐదు దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. మొత్తం 15 దుకాణాలను క్రోడీకరించి ఈ మేరకు మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ నోటిఫికేషన్ జారీ చేశారు. నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం కులాలవారీగా దుకాణాలను ప్రకటించారు.

అర్హతలు: కాగా డీలర్ల నియామకానికి ఇంటర్మీడియట్ (12వ తరగతి) కనీస విద్యార్హతగా నిర్ణయించారు. స్థానికంగా వీరు లేకుంటే ఇంటర్ ఫెయిల్ అయిన వారిని కూడా పరిగణనలోకి తీసుకుంటారు. అభ్యర్థులు స్థానిక సంస్థల్లో ఎలాంటి పదవుల్లో వుండరాదు. అంతేగాకుండా కిరసనాయిల్, చక్కెర, నూనెల వ్యాపారం చేసేవారి సంబంధీకులుగా వుండరాదు. 18 సంవత్సరాల వయసు పైబడి 40 ఏళ్ల లోపు వారు ఉండాలి. ఈ నెల 15 లోపు సంబంధిత తహసీల్దారుకు దరఖాస్తులు పంపాలి.

ఎమ్మెల్యే నల్లారి విస్తృత పర్యటన


బీమా ప్రచార పత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పీలేరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి బుధవారం పీలేరు మండలంలో విస్తృత పర్యటన నిర్వహించారు. పీలేరు పట్టణంలోని టీడీపీ నాయకులు చరణ్ రెడ్డి, కోటపల్లెలోని సుధాకర్‌రెడ్డిలను పరామర్శించారు. స్థానిక వివేకానంద సర్కిల్‌లో బోడుమల్లువారిపల్లె మాజీ సర్పంచ్ సురేశ్‌కుమార్‌రెడ్డి కుమార్తె డా.హర్షిత ఆసుపత్రిని ప్రారంభించారు. తలపులలో పంటల బీమాపై వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ 2024-25 సీజన్‌కు రైతులు ఎకరా వరికి రూ.126లు, ఎకరా వేరుశనగకు రూ.96లు ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలన్నారు. ఈ నెల 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించి ప్రభుత్వం కల్పించిన బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'చలో కడప'ను విజయవంతం చేయాలి

పీలేరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కడపలో ఈ నెల 15వ తేదీన జరగనున్న 'చలో కడప' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీలేరులోని ముతవల్లీలు ముస్లింలకు పిలుపునిచ్చారు. పీలేరు జామియా మసీదులో బుధవారం జరిగిన కార్యక్రమంలో వారు ఆ కార్యక్రమం ప్రచార పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముతవల్లీ ఖతీబ్ అల్లావుద్దీన్ మాట్లాడుతూ 15న సాయంత్రం 4 గంటలకు కడపలోని బైపాస్ రోడ్డులో జయరాజ్ గార్డెన్స్‌లో జరిగే ఈ కార్యక్రమానికి హాజరవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డా.హబీబ్ బాషా, ముతవల్లీలు రఫీ, రియాజుల్లా, ఇమ్దాదుల్లా, హారున్, అస్లమ్, ముస్లిం జేఏసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టుకు మిట్స్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ యువరాజ్

కురబలకోట, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు జేఎన్‌టీయూ వాలీబాల్ జట్టుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో ఈఈఈ ఫైనలియర్‌కు చెందిన విద్యార్థి అమోస్, ద్వితీయ సంవత్సరం మెకానికల్ విభాగానికి చెందిన సాజిద్‌లు అనంతపురం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ సెలక్షన్ క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. కాగా ఎంపికైన విద్యార్థులు కేరళలోని తిరువనంతపురంలో ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు.విద్యార్థులను కరెస్పాండెంట్ ఎన్.వి జయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్ యువరాజ్, పీడీ దామోదరన్ తదితరులు అభినందించారు.

కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

● టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడు మస్తాన్

మదనపల్లె, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని టీఎన్‌టీయూసీ గౌరవాధ్యక్షుడు ఎస్.ఎ.మస్తాన్ పేర్కొన్నారు. స్థానిక టమోటా మార్కెట్‌లో బుధవారం హమాలీ వర్కర్స్ యూనియన్ టీఎన్‌టీయూసీ విభాగం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న మస్తాన్.. కార్మికలోకాన్ని ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భక్తి శ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ


అలంకరణలో నల్లవీర గంగమ్మ

నిమ్మనపల్లి, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మనపల్లి పంచాయతీ వెంగలవారికురవపల్లిలో బుధవారం భక్తి శ్రద్ధలతో వేదపండితులచే భాజాభజంత్రీలు, మేళతాళాల మధ్య నలవీర గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మూడు రోజులుగా మహాగణపతి పూజ, గోపూజ, మంగళహరతి, శాంతి హోమం తదితర పూజల అనంతరం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఉకా అమ్రేష్ దంపతులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఇంజనీరింగ్ కార్మికులను క్రమబద్ధీకరించండి

● ఎమ్మెల్యేకు కాంట్రాక్టు కార్మికుల వినతి

మదనపల్లె, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరణ చేయాలని, మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికుల యూనియన్ సంఘం నేతలు, ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషాను కోరారు. తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కార్మికులు బుధవారం ఎమ్మెల్యేను కలసి వినతి పత్రం అందజేశారు. సుప్రీంకోర్టు సూచన మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఇందులో కార్మికసంఘం నాయకులు ఎం.ఎస్.కన్నయ్య, శాంతిపురం నాగరాజు, కె.గోపాలకృష్ణ, ఎస్.బాలకృష్ణ, రత్నకుమార్, ఎస్.ఎ.సజాద్, తదితరులు ఉన్నారు.